


# మనం
## ఖమ్మం
## భద్రాద్రి కొత్తగూడెం

www.manamepaper.com | శుక్రవారం | 19 | జూన్ | 2026 | పేజీలు : 15


## "డయల్ యువర్ ఎమ్మెల్యే"కు
# విశేష స్పందన

- ప్రజల విజ్ఞప్తులను విన్న ఎంఎల్ఏ మట్టా రాగమయి దయానంద్
- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు



వివరాలు 6 లో..

# బిఆర్ఎస్ సమావేశం రసాభాస

- ఎమ్మెల్సీ రవీందర్, వనమా రాఘవ వ్యాఖ్యలతో కార్యకర్తల ఆందోళన
- కుర్చీలు విరగ్గొట్టి నిరసన..
- కాసేపు ఉద్రిక్తత..
- చివరికి ఐక్యతకు నేతల పిలుపు



కొత్తగూడెంలో బిఆర్ఎస్ నేతల సమావేశం రసాభాసగా మిగిలింది. ఎంఎల్సి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, రాష్ట్ర నాయకులు వనమా రాఘవ వ్యాఖ్యలతో కార్యకర్తలు ఆందోళనకు దిగారు కాసేపు ఉద్రిక్తతంగా మారింద. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కార్యకర్తలను వారించారు. వివరాలు 7లో

# ఖబడ్దార్ కేటీఆర్

నీ జిమ్మిక్కులు నడవవు

- రాష్ట్ర మంత్రులపై బురదజల్లే ప్రయత్నాలు మానుకో
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** రాష్ట్ర మంత్రులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి ఆర్ పాలేరు సభ వేదికగా చేసిన ఆరోపణలపై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పాడిందే పాడరా.. పాచిపండ్ల దాసరా ..అన్నట్టు అవే అబద్ధాలను పదే పదే చెబితే నిజాలు మారవు, అంటూ మండిపడ్డారు. తెలంగాణ యాసలో మాట్లాడితే పదేళ్ల మీ అవినీతి, అక్రమాలను ప్రజలు మరిచిపోతారని భావించడం భ్రమేనని స్పష్టం చేశారు. మట్టి గుట్టలకు, రోడ్లకు రైతుబంధు నిధులు మళ్లించింది మీరు కాదా? అమెరికాలోని ప్రవాస భారతీయుల వందల ఎకరాల భూములకు రైతుబంధు చెల్లించింది మీ ప్రభుత్వమే కాదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. స్కీముల పేరుతో స్కాములు చేసి లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిందీ, ధరణి పేరుతో వేల ఎకరాల భూములపై దందాలు నడిపిందీ బీఆర్ఎస్ పాలనేనని ఆరోపించారు. మాటల గారడీలో పీహెచ్డీ చేసి ఉండొచ్చు కానీ ప్రజల జ్ఞాపకశక్తిని తక్కువ అంచనా వేయొద్దు అంటూ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఆర్థిక విధ్వంసానికి ప్రతీకగా నిలిచిందని, ఆ పాపాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ముగ్గురు మంత్రులు జిల్లాలో ప్రజల మధ్య తిరుగుతూ నిరంతరం సమస్యలు పరిష్కరిస్తున్న నాయకులని సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ప్రజాదర్బార్ల ద్వారా వేలాది సమస్యలకు పరిష్కారం చూపుతున్నారని, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్న సేవాభావాన్ని చూసి ఓర్వలేకే కేటీఆర్ విషప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రతి పల్లెలో జరుగుతున్న అభివృద్ధి పనులే కేటీఆర్ విమర్శలకు సమాధానమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందనే కలలు రాత్రిళ్లు 15లో..

# భవిష్యత్‌కేదీ భరోసా

- రాజయ్య నగర్‌లో లేని ప్రభుత్వం బడి
- నేటి దాకా గ్రామస్తుడే అనధికారికంగా పాఠశాల నిర్వహణ
- విద్యార్థులకు ఆటో ఏర్పాటు చేస్తామంటున్న ఉపాధ్యాయులు
- గ్రామస్తులు ఒప్పిస్తే మెరుగైన విద్య
- బడి ఏర్పాటు చెయ్యాలని ఐటిడిఏకు ఆదివాసీల వినతి





**చర్ల, జూన్ 18 (మనం న్యూస్) :**
గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ఏర్పాటు చేయించి చదువులను తమ దగ్గరకు తీసుకువచ్చే ప్రయత్నం చేసినా ఆదివాసీలకు అది నెరవేరని కలగానే మిగిలింది. ఇతర ప్రాంతాలలోని పాఠశాలలకు తమ పిల్లలను పంపించబోమని, గ్రామంలోనే పాఠశాల ఏర్పాటు చేయాలని అంత వరకు తామే సొంతంగా పాఠశాల నిర్వహించుకుంటాలని భీష్మించారు. అయినా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో అక్కడి విద్యార్థుల భవిష్యత్ కు భరోసా లేకుండా పోయింది. ప్రస్తుతం గ్రామస్తుల ఆధ్వర్యంలో అనధికారికంగా పాఠశాల నిర్వహిస్తుండటంతో వారి చదువులకు విలువలేకుండా పోగా రెండేళ్ల విలువైన విద్యా సంవత్సరాన్ని కోల్పోయారు.

చర్ల మండలం సుబ్బంపేట పంచాయతీ క్రాంతిపురం, రాజయ్యనగర్‌లు జంటగ్రామాలు. వీరు రెండు దశాబ్దాల క్రితం 15లో..

మనం



# ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాథపాలెం

# అయ్యప్ప భక్తులకు శుభవార్త

**– ఖమ్మంలో ఆగనున్న 'కేరళ ఎక్స్ప్రెస్'.**

**– కేంద్ర రైల్వే మంత్రితో పొంగులేటి సుధాకర్ రెడ్డి మంతనాలు**

**– సానుకూలంగా స్పందించిన కేంద్రం.. సర్వత్రా వ్యక్తమవుతున్న హర్షం.**



**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** శబరిమల వెళ్లే అయ్యప్ప స్వాములతో పాటు దక్షిణ భారత రాష్ట్రాలకు ప్రయాణించే వారికి శుభవార్త. న్యూఢిల్లీ – తిరువనంతపురం (కేరళ) మధ్య రాకపోకలు సాగించే ప్రధాన రైలు 'కేరళ ఎక్స్ప్రెస్' (నంబర్లు 12625/12626) త్వరలో ఖమ్మం రైల్వే స్టేషన్లో నిలవనుంది. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఖమ్మం వచ్చిన బిజెపి జాతీయ నాయకులు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి కి బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చేసిన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి ఈ విషయమై కేంద్ర రైల్వే శాఖ మంత్రితో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రయాణికుల ఇబ్బందులను ఆయన మంత్రికి కూలంకషంగా వివరించగా, సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఖమ్మంలో ఈ రైలు నిలుపుదలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. భౌగోళికంగా, వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం జిల్లా కేంద్రం గుండా కేరళ ఎక్స్ప్రెస్ వెళ్తున్నప్పటికీ ఇక్కడ హాల్టింగ్ లేదు. దీనివల్ల ప్రతీ ఏడు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి శబరిమల యాత్రకు వెళ్లే లక్షలాది మంది భక్తులు తీవ్ర అవస్థలు పడేవారు. ముఖ్యంగా ఇరుముడితో వెళ్లే స్వాములు, వయోవృద్ధులు తప్పనిసరి పరిస్థితుల్లో వరంగల్ లేదా విజయవాడ వెళ్లి అక్కడి నుంచి ఈ రైలు ఎక్కాల్సి వచ్చేది. ఇది వారికి ఆర్థికంగా, శారీరకంగా ఎంతో శ్రమతో కూడుకున్న వ్యవహారం. కేవలం భక్తులకే కాకుండా విద్యా, వ్యాపార, ఉద్యోగ నిమిత్తం కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులకు ఖమ్మంలో రైలు ఆగకపోవడం పెద్ద లోటుగా ఉండేది. ప్రజల ఈ కష్టాలను గ్రహించి, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సుధాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వం ద్వారా సమస్యకు పరిష్కారం చూపారు. కేరళ ఎక్స్ప్రెస్ నిలుపుదలకు కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం రావడం పట్ల ఖమ్మం జిల్లా వాసులు, అయ్యప్ప భక్తులు అమితానందం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల కష్టాలను తీర్చేందుకు చొరవ చూపిన పొంగులేటి సుధాకర్ రెడ్డికి, ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావుకు జిల్లా నాయకత్వం, స్థానిక నేతలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మందికి మేలు జరగడమే కాకుండా, ప్రజలకు వ్యయప్రయాసలు తప్పుతాయని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎరువులు, విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు: సీపి**



**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడడంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. రైతులను మోసం చేసే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు లేదా నాసిరకం పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపట్టేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. రైతులు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. బిల్లు లేకుండా కొనుగోలు చేసిన వస్తువుల విషయంలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తితే చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని తెలిపారు. అలాగే అనుమానాస్పదంగా కనిపించే విత్తనాలు లేదా ఎరువుల గురించి వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సత్తుపల్లి, వైరా, తల్లాడ, చింతకాని, కామేపల్లి, తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు నిర్వహించారు.

# పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

**–ఈహెచ్ఎస్ కు విధి విధానాలు ఎప్పటికి?**

**–ఎస్టీపిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య**




**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** ఆర్థిక సమస్యలతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సతమతమవుతున్నారని, సత్వరమే పెన్షనర్లకు ఉద్యోగ విరమణ బకాయిలు చెల్లించాలని, నగదు రహిత వైద్యసేవలకు ఉద్దేశించిన ఈహెచ్ఎస్ విధివిధానాలు సత్వరం ప్రకటించి అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్టీపిపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం నాడు కృషిభవన్లో ఎస్టీపిపిఏటి ముఖ్యకార్యకర్తల సమావేశానికి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. తరచూ మారుతున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా పెన్షనర్లు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఉద్యోగ విరమణ బకాయిలు రాకుండానే పలువురు పెన్షనర్లు తనువు చాలించారని, పెన్షనర్ల బకాయిల నిమిత్తం కోట్లాది రూపాయలు విడుదల చేసామనే హోరెత్తే ప్రచారం బదులు నిధులు విడుదల చేయాలని,వందలాది పెన్షనర్లకు జిపిఎఫ్ లోనే కోట్లాది రూపాయలు బకాయిలు ఉండగానే జిపిఎఫ్ చెల్లింపులు పూర్తి అయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం చెప్పటం శోచనీయం అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య విమర్శించారు. విధివిధానాలు లేకుండా, ట్రస్ట్ కమిటీ ఏర్పాటు కాకుండానే ఉద్యోగులు, పెన్షనర్ల నుండి ప్రీమియం మినహాయించిన ప్రభుత్వం తక్షణంవిదివిధానాలు ప్రకటించాలని, ఏఏ వైద్యశాలల్లో వైద్య చికిత్స ఉందో తెలపాలని, ట్రస్ట్ బోర్డు లో పెన్షనర్ల ప్రతినిధులుగా ఎస్టీపిపిఏటి తో పాటు సిపిఎస్ ఉద్యోగ సంఘం ప్రతినిధికి ప్రాతినిధ్యం కల్పించాలని ఎస్టీపిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి రాయలరవికుమార్, ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ, ఊడుగు వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, హుస్సేన్,నాగప్రసాద్, ఉషారాణి, చీదిరాల వెంకటేశ్వర్లు, భాస్కరరావు, ఆదినారాయణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాలి....

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**లేఔట్ అనుమతికి అప్రోచ్ రోడ్డు నిర్మాణం తప్పనిసరి**

**వాటర్ బాడీస్ ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ లలో ఎటువంటి అనుమతులు ఇవ్వవద్దు**

**జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, జూన్18(మనం బ్యూరో):** లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్ హాల్లో జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పాల్గొన్నారు. పెండింగ్ ఉన్న లేఔట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, ప్రతి లే అవుట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ లేఔట్ అనుమతులకు వచ్చిన 17 దరఖాస్తులను కమిటీ పరిశీలించిందని అన్నారు. లేఔట్ అనుమతులను మంజూరు చేసే సమయంలో తప్పనిసరిగా ఎటువంటి వాటర్ బాడి ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో రాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. లేఔట్ లో అప్రోచ్ రోడ్డు 18 మీటర్లు ఉండాలని అన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లే ఔట్ లో కేటాయింపులు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ లలో అనుమతులు జారీ చేయడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్, మండల సర్వేయర్, ఆర్డిఓ లు సంయుక్తంగా లేఔట్ దరఖాస్తును చుట్టు పక్కల సర్వే నెంబర్లను పరిశీలించి రిపోర్ట్ అందించాలని అన్నారు. లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి వనరులు ఉన్నాయా అని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా సాంకేతికతను వినియోగిస్తూ పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని, మనం జారీ చేసిన అనుమతుల నిబంధనలను అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారు లేదో పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ఎస్.డి.సి. సదానందం, ఇరిగేషన్ సిఇ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, పి ఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ. శ్రీనివాసా చారి, సుడా సిపిఓ రాజ్ కుమార్, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పొంగులేటిపై విమర్శలు మానాలి..

## ప్రజలే తగిన సమాధానం చెబుతారు: కేటీఆర్ వ్యాఖ్యలు రాజకీయ ప్రేరేపితమే

## పాలేరులో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

## గోల్లపాడులో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు



**ఖమ్మం రూరల్, జూన్ 18 (మనం న్యూస్) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, ఆ ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు నిరాధార విమర్శలకు దిగుతున్నాయని ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం అన్నారు. గోల్లపాడులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరుతున్నాయని, అందువల్లే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష నాయకులు రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలు గమనిస్తున్నారని, వ్యక్తిగత విమర్శలకు బదులుగా అభివృద్ధిపై చర్చ జరగాలని కాంగ్రెస్ నేతలు సూచించారు. గతంలో అధికారంలో ఉన్నవారు రాష్ట్రానికి ఏమి చేశారో ప్రజలకు బాగా తెలుసని, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతులు, మహిళలు, యువత, పేదల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా నిర్మాణాత్మక సూచనలు చేస్తే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నాయకుడు మద్ది వీరారెడ్డి మాట్లాడుతూ. పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు మరింత బలపడుతోందన్నారు. గత ఎన్నికల్లో లభించిన భారీ మెజార్టీని మించి రానున్న ఎన్నికల్లో మరింత అధిక మెజార్టీ సాధించే దిశగా పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రజల విశ్వాసం కాంగ్రెస్ పార్టీపై మరింత పెరిగిందని, పాలేరులో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని గత ఎన్నికల కంటే మరింత భారీ మెజార్టీతో గెలిపించడమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే ఉందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే పార్టీ విజయానికి బలమైన ఆయుధాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లింగ శ్రీనివాసరావు, చింతపల్లి మాజీ సర్పంచ్ ముత్యం కృష్ణారావు, గనిగంటి సురేష్, రుద్ర ఉపేందర్, శ్యామల రామ్‌రెడ్డి, గంగిరెడ్డి, కొండం మధు, వెల్దుర్తి నారాయణ, సోషల్ మీడియా బద్రి సాయి తదితరులు పాల్గొన్నారు.

# అదనపు బస్సు సర్వీసులు: డిపో మేనేజర్ హామీ

## స్వేరో నియోజకవర్గ అధ్యక్షుడు కోండ్రు రామచంద్రు చొరవ

## ఉదయం, సాయంత్రంతో పాటు మధ్యాహ్నం కూడా బస్సు నడిపేందుకు గ్రీన్ సిగ్నల్

## రైతులు, ప్రయాణికుల ఇబ్బందులు తీరనున్న వైనం



**తిరుమలాయపాలెం జూన్ 18 (మనం న్యూస్)** రఘునాథపాలెం, సుబ్లేడు, మేడిదపల్లి , రేఖ్యతండా వాటి చుట్టుపక్కల గ్రామాల ప్రయాణికులు, రైతుల రవాణా ఇబ్బందులను గమనించిన పాలేరు నియోజకవర్గం స్వేరో అధ్యక్షుడు కోండ్రు రామచంద్రు గురువారం ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్ (డిఎం), అసిస్టెంట్ మేనేజర్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ గ్రామాల మీదుగా ఉదయం, సాయంత్రం రెండు పూటలు మాత్రమే బస్సు సర్వీసులు నడుస్తున్నాయని తెలిపారు. మధ్యాహ్నం 11:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు ఎలాంటి బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున చుట్టుపక్కల గ్రామాల రైతులు పట్టణం నుండి ఎరువులు, విత్తనాలు తెచ్చుకోవడానికి రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కోండ్రు రామచంద్రు ఇచ్చిన లేఖపై ఖమ్మం డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు సానుకూలంగా స్పందించారు. ప్రయాణికుల అవసరాలను గుర్తించి, త్వరలోనే బస్సు ట్రిప్పుల సంఖ్యను పెంచుతామని హామీ ఇచ్చారు. ఇకపై రోజుకు మూడు సార్లు బస్సు వచ్చే విధంగా అదనపు సర్వీసును ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక ప్రజల సమస్యపై తక్షణమే స్పందించిన స్వేరో ప్రతినిధులకు, ఆర్టీసీ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎర్రగడ్డ ప్రగతి పథం.. 'కీర్తి' కిరీటంలో మరో మైలురాయి!

## దశాబ్దాల డ్రైనేజీ కష్టాలకు శాశ్వత విముక్తి

## దగ్గరుండి పనులు పూర్తి చేయించిన సర్పంచ్ నల్లమల్ల కీర్తి



**తిరుమలాయపాలెం జూన్ 18 (మనం న్యూస్)** ఎన్నికైన అతి తక్కువ కాలంలోనే తనదైన ముద్ర వేస్తూ, తిరుమలయపాలెం మండల పరిధిలోని ఎర్రగడ్డ గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో ముందంజలో నిలిపారు నూతన సర్పంచ్ నల్లమల్ల కీర్తి. గ్రామ పగ్గాలు చేపట్టిన నాటి నుండి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా దూసుకుపోతున్న ఆమె, తాజాగా గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న ప్రధాన సమస్యకు తెరదించారు. ఎర్రగడ్డ గ్రామంలో ఎన్నో ఏండ్లుగా మురుగునీటి పారుదల వ్యవస్థ సరిగ్గా లేక, డ్రైనేజీ నీరంతా రోడ్లపైకి చేరి ప్రజలు నరకయాతన అనుభవించేవారు. దోమల వ్యాప్తి, దుర్వాసనతో నిత్యం అల్లాడిపోతున్న గ్రామస్థుల కష్టాలను గుర్తించిన సర్పంచ్ నల్లమల్ల కీర్తి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సంకల్పించారు. ఇందులో భాగంగా గురువారం ఆమె స్వయంగా క్షేత్రస్థాయికి చేరుకుని, మురుగు కాలువల పూడికతీత, పునర్నిర్మాణ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. అధునాతన పద్ధతుల్లో డ్రైనేజీ లైన్లను క్లియర్ చేయించి, మురుగునీరు సజావుగా సాగిపోయేలా శాశ్వత ఏర్పాట్లు పూర్తి చేయించారు. మాట ఇస్తే మడమ తిప్పని సర్పంచ్: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ఎర్రగడ్డను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా సర్పంచ్ నల్లమల్ల కీర్తి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోని డ్రైనేజీ సమస్యను పట్టుదలతో పరిష్కరించిన మహిళా సర్పంచ్ నల్లమల్ల కీర్తిపై గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

# వివోఏల భవన నిర్మాణ పనుల పరిశీలన

## ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్



**తిరుమలయపాలెం, జూన్ 18 (మనం న్యూస్)** మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల్లో శరవేగంగా జరుగుతున్న విలేజ్ ఆర్గనైజేషన్ (వివో ఏ ల) భవన నిర్మాణ పనులను గురువారం స్థానిక ఎంపీడీఓ అధికారుల బృందంతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో పంచాయతీ రాజ్ ఏఈ, ఎంపీఓ ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.మండలంలోని బచ్చోడు, పైనంపల్లి, రాజారం, సుబ్లేడు, దమ్మాయిగూడెం, కొక్కిరేణి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న భవనాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే ఎర్రగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని గోపాలపురంలో నూతన భవన నిర్మాణానికి సంబంధించిన మార్కౌట్ పనులను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిర్దేశిత గడువులోగా భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ అయితో పాటు ఎంపీ ఓ ఆయా గ్రామాల సర్పంచులు స్థానిక నాయకులు పాల్గొన్నారు

# పిండిప్రోలులో విత్తన దుకాణాల తనిఖీ



**తిరుమలయపాలెం, జూన్ 18 (మనం న్యూస్)** మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో గురువారం వ్యవసాయ, పోలీస్ అధికారులు ఉమ్మడిగా విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శ్రీనారెడ్డి సీతారామరెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.ఈ సందర్భంగా దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, 'ఓ' ఫామ్‌లు, జిఓటీ నివేదికలు, కంపెనీల మరియు డీలర్ల లైసెన్సులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు నిబంధనల ప్రకారం రికార్డులను నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ (ఏఈఓ) కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధ, డిజిటల్ లెర్నింగ్ పై శిక్షణ



**నేలకొండపల్లి జూన్ 18 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నా-అక్క కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులకు రెండు రోజుల కృత్రిమ మేధ, డిజిటల్ లెర్నింగ్ పై శిక్షణా తరగతులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులు గురువారం మరియు శుక్రవారం జరగనున్నాయి.ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్ డాక్టర్ కె.మందాకిని హాజరై ఏఐ సాధనాలను ఉపయోగించి వివిధ సబ్జెక్టుల్లో నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలో వివ రించారు. డిజిటల్ లెర్నింగ్ ప్లాట్ ఫామ్ ల వినియోగంపై అదేవిధంగా అన్న-అక్క కార్యక్రమంపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ రెండు రోజుల శిక్షణ పొందిన డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నేలకొండపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల 6 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు ఏఐ, డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ....అన్న-అక్క కార్యక్రమం విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేస్తుందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కళాశాల ఏఐ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.వెంకటేశ్వర రెడ్డి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రమేష్, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం



# వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు

## ఇన్‌స్ట్రక్టర్లు,ఆయాల నియామకాలకు ఇంటర్వ్యూలు

**కొణిజర్ల, జూన్ 18 (మనం న్యూస్):** కొణిజర్ల మండలంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ ప్రాథమిక తరగతులు మంజూరైన నేపథ్యంలో పూర్వ ప్రాథమిక పాఠశాల ఇన్‌స్ట్రక్టర్లు,ఆయాల నియామక ప్రక్రియ చేపట్టినట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.మంజూరైన పాఠశాలలు ఎంపీపీ ఎస్ కొణిజర్ల, ఎంపీపీ ఎస్ కొణిజర్ల హెచ్‌డబ్ల్యూ, ఎంపీ యూపీఎస్ రామనర్సయ్య నగర్, ఎంపీ యూపీఎస్ గోపవరం, ఎంపీపీ ఎస్ పెద్ద మునగాల పాఠశాలలు. ఈ పోస్టుల భర్తీ కోసం ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 19న కొణిజర్ల ఎంఆర్సీ లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లు, సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు ఎంఆర్సీ కేంద్రానికి హాజరుకావాలని సూచించారు.ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయానికి తప్పనిసరిగా రావాలని మండల విద్యాశాఖ అధికారి కోరారు.



## ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

**కొణిజర్ల, జూన్ 18 (మనం న్యూస్) :** మండల కేంద్రంలోని కొణిజర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆధార్ సేవా కేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారి అబ్రహం గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేట్‌లు, ఆధార్ సవరణలు చేయించుకోవాలని సూచించారు.ఇంకా ఆధార్ కార్డు లేని విద్యార్థులు నూతన ఆధార్ నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల ఆధార్ వివరాలు సక్రమంగా ఉండటం విద్యా సంబంధిత సేవలు, ప్రభుత్వ పథకాల అమలులో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఆధార్ ఆపరేటర్లు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పరస్పర సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు.

## నేడు..జిల్లాలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పర్యటన



**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం రోజున జిల్లాలో పర్యటించనున్నారు. తొలుత ఉదయం 10:15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంప్ కార్యాలయంలో ఎంపీ అందుబాటులో ఉంటారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులను కలుసుకుని వారి విజ్ఞప్తులను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 1:30 గంటల వరకు జిల్లాలో పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3:30 గంటలకు కల్లూరులోని ఇండోర్ స్టేడియంకు చేరుకుంటారు. అక్కడ క్రీడా సౌకర్యాల కల్పన కోసం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. ఈ మేరకు ఎంపీ క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం ఓ ప్రకటన వెలువడింది.

## అభివృద్ధి-సంక్షేమం దిశగానే అడుగులేస్తున్నాం

### కాంగ్రెస్ హయాంలోనే రైతులకు మేలు జరుగుతుంది

### మాధారంలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**కారేపల్లి, జూన్18(మనం న్యూస్):** అభివృద్ధి సంక్షేమం దిశగానే అడుగులేస్తున్నామని, కాంగ్రెస్ హయాంలోనే రైతులకు మేలు జరుగుతున్నదని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు.గురువారం సింగరేణి మండల పరిధిలోని మాదారం గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు,సైడ్ డ్రైనేజీ, రూ.10 లక్షలతో చేపట్టే గ్రామసమాఖ్య భవనం నిర్మాణ పనులను సర్పంచ్ అజ్మీర ఉమారాణితో కలిసి ఆయన ప్రారంభించారు.అనంతరం అధికారులతో మండల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కారేపల్లి మండల రైతుల ప్రయోజనాల కోసం పట్టుబట్టి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.కొనుగోలు కేంద్రం ద్వారా 807 మంది రైతులకు చెందిన 49,950 క్వింటాళ్లు రూ. 12 కోట్ల విలువైన మొక్కజొన్న కోనుగోలు చేసి రైతులకు డబ్బులు బ్యాంకు ఖాతాలలో జమ చేశామన్నారు.కారేపల్లి మండలం అప్పాయిగూడెంలో గోదాం ఉండటంతో మండల రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మొక్కజొన్న గోదాం ద్వారా కొనుగోలు చేసి డబ్బులు జమ చేయటం జరిగిందన్నారు. గోదాం ద్వారా జరిగే లాభం దృష్టిలో ఉంచుకుని రూ.20 కోట్లతో గుట్టకిందిగుంపు వద్ద గోదాం నిర్మించటం జరుగుతుందన్నారు.ప్రభుత్వం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందిస్తున్నప్పటికీ నిధుల లెక్కలు క్షేత్రస్థాయిలో ప్రచారం కావటం లేదన్నారు.ప్రతి ఒక్కరి వద్ద ప్రభుత్వం అభివృద్ధి లెక్కలు ఉండాలన్నాను. ప్రభుత్వం నుండే కాకుండా సింగరేణి సంస్థ ద్వారా కూడా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.గ్రామాల్లో 200 హైమాక్స్ లైట్లు,పోడు రైతులకు బోర్లు,కరెంటు సదుపాయం కల్పించినట్లు తెలిపారు.బీఆర్ఎస్ పాలనలో గిరిజనులకు ఆర్థికంగా చేయూతను అందించే ఐటీడీఏ ను అధోగతి పాలు చేశారని విమర్శించారు.ప్రజలు అభివృద్ధిని గమనించి మళ్ళీ మళ్ళీ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,డీసీసీ ఉపాధ్యక్షులు పగడాల మంజుల, డీసీసీ ప్రధాన కార్యదర్శి బానోత్ రాంమ్మూర్తి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు,సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్,సోసైటీ మాజీ అధ్యక్షులు ఈసాల నాగేశ్వరరావు,తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్, ఎంఈవో దుగ్గిరాల జయరాజు,సూపర్నిటెండెంట్ మల్లెల రమేష్, ఏఈలు వెంకన్న,నరేందర్, రాజశేఖర్,ఆర్ఐలు జగదీష్, అక్బర్ అలీ, కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన ఉమాశంకర్, అడ్డగోడ ఐలయ్య, సర్పంచ్లు బానోతు హీరాలాల్,మేదరి వీరప్రతాప్, అంగోత్ మత్రు, దరావత్ వెంకటేశ్వర్లు,ఈసం మోతీవీరస్వామి, పూసం ఎల్లయ్య, బానోత్ పద్మ,బానోత్ రాందాస్, దండు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

### వ్యవసాయ శాఖ ఏవో మంజూమ్ ఖాన్, వైరా ఎస్సై రామారావు



**వైరా, జూన్ 18 (మనం న్యూస్) :** నకిలీ విత్తనాలు విక్రయించిన,రైతుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏవో మంజూమ్ ఖాన్, వైరా ఎస్సై రామారావు అన్నారు. గురువారం వైరా లోని తాడిపూడి లో ముమ్మర తనిఖీలు చెప్పట్టారు.వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టడానికి వ్యవసాయ, పోలీస్ శాఖలు సంయుక్తంగా విత్తన దుకాణాలు, గోదాములు, రవాణా కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని, రైతుల కష్టార్జిత సంపాదనను దోచుకునే నకిలీ వ్యాపారులపై పోలీస్, వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.వైరా పరిసర ప్రాంతాల రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు.

## లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు

**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):**



నేరాల నియంత్రణ, భద్రతా చర్యల్లో భాగంగా ఖానాపురం హవెలి ఇన్స్పెక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుర్తింపు పత్రాలు రిజిస్టర్ ఎంట్రీలు, సీసీటీవీ కెమెరాల పనితీరు మరియు చెక్-ఇన్, చెక్-అవుట్ సమయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. లాడ్జీ యాజమాన్యం గెస్ట్ నుండి ఒరిజినల్ గుర్తింపు కార్డులను పరిశీలించి, వాటి జిరాక్సును భద్రపరచాలన్నారు. సరైన గుర్తింపు లేకుండా ఎవరికీ గదులు కేటాయించకూడదన్నారు. హోటల్ ప్రవేశ ద్వారాలు, ఎగ్జిట్ గేట్లు, మరియు రిసెప్షన్ ప్రాంతాలలో హెచ్డీ సీసీటీవీ కెమెరాలు 24/7 పనిచేసేలా చూడటం యాజమాన్యం బాధ్యతని అన్నారు. లాడ్జీలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు లేదా అసాధారణ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే, యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సరైన రికార్డులు నిర్వహించని మరియు భద్రతా ప్రమాణాలను పాటించని లాడ్జీల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల్లెపల్లి గణేష్ టౌన్ షిప్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు.

## బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో వంటల పోటీలు

**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గ్యాస్, ఆయిల్ లేకుండా వంటల పోటీల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. సమాజంలో ఆరోగ్యకరమైన వంటలు భావితరాలకు అందించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశం అని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పమ్మీ అనిత అన్నారు. ఈ పోటీలలో పాల్గొని గెలుపొందిన మహిళలకు బహుమతి అందచేశారు. ఈ కార్యక్రమంలో జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా నాయకురాలు గోలి ఫణి కుమార్ , మమతా , విజయ తదితరులు పాల్గొన్నారు .

# పిఆర్టీయు సంఘ సభ్యత్వ నమోదు

**మధిర, జూన్ 18 (మనం న్యూస్) :** పిఆర్టీయు మధిర మండల శాఖ ఆధ్వర్యంలో రెండో రోజు మండలంలో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణ రెడ్డి పోలే సుధాకర్ పేర్కొన్నారు. రెండో రోజు మల్లారం,రొంపి మల్ల వంగవీడు, సిరిపురం మర్లపాడు మాటూరు నిదానపురం, టౌన్ లోని పాఠశాలలలో క్యాంపెయిన్ నిర్వహించినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు మాట్లాడుతూ పి ఆర్ సి పెండింగ్ డి ఏ లు పెన్షనర్స్ బకాయిలు పెండింగ్ బిల్లులు విడుదలపై ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారని కానీ ఇప్పటికీ ఆ దిశగా చర్యలు ఏమి చేపట్టకపోవడం శోచనీయమని పి ఆర్ సి ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు పై ప్రభుత్వం మాట నిలుపుకోవాలని కోరారు. పెండింగ్ డి ఎ లు,పెన్షనర్స్ బకాయిలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని లేకుంటే త్వరలోనే ఉధ్యమ కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. హెల్త్ కార్డు మార్గదర్శకాలను త్వరగా విడుదల చేయాలని రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయు లందరికీ ఉపయోగపడేలా హెల్త్ కార్డ్స్ ఉండాలని పేర్కొన్నారు.



బడిబాటను మరియు సెన్సెస్ విధులను విజయవంతంగా పూర్తి చేసిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను అభినందించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ వి రవికుమార్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలే సుధాకర్, మండల బాధ్యులు పిల్లి నరసింహారావు, ఎండి జమీర్, మల్లెల శ్రీనివాస్ బాబు ,రాజా, అజయ్ కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు పిడిపి జ్యోతి మహిళా కార్యదర్శి టి అనసూయ, జి కేశవులు, గిరిబాబు, గుల్జార్, అరుణ శ్రీ ప్రమీల, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఆశాజ్యోతి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

## మాటూరు గ్రామ సర్పంచ్ రాయబారపు పుల్లారావు

**మధిర, జూన్ 18 (మనం న్యూస్) :** మండల పరిధిలోని మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అందరికీ ఆశాజ్యోతి ఫౌండేషన్ నిర్వాహకులు ఉచితంగా స్కూల్ బ్యాగులు నోట్ బుక్స్ గ్రామ సర్పంచ్ రాయబారపు పుల్లారావు చేతుల మీదుగా గురువారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు అండగా ఆశాజ్యోతి ఫౌండేషన్ వారు నిలుస్తూ విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులు నోట్ బుక్స్ అందించటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రత్యేక బాధ్యతతో మధిర ప్రాంతానికి స్కూల్ బ్యాగులు నోటుబుక్స్ అందేలా కృషి చేస్తున్న పెద్దలు కోనా మోహన్ రావు, తనికెళ్ల ఉపాధ్యాయులు వాసిరెడ్డి రామ్మోహన్ రావు లకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం గ్రామ సర్పంచ్ రాయబారపు పుల్లారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూతనందిస్తున్న ఆశాజ్యోతి ఫౌండేషన్ వారికి ఆ సంస్థ మధిర ప్రాంత బాధ్యులు సత్యసాయి సేవా సంస్థ అధ్యక్షులు కోనా మోహన్ రావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు వాసిరెడ్డి రామ్మోహన్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమంకు



ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఆశాజ్యోతి ఫౌండేషన్ బాధ్యులు కోనా మోహన్ రావు మాట్లాడుతూ దాతలు దాతృత్వాన్ని సద్వినియోగం చేసుకొని సుశిక్షితులైన ఉపాధ్యాయుల సహకారంతో చిన్నారులంతా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కొట్టె వెంకట్రావమ్మ విశ్రాంత ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం, పాఠశాల ఉపాధ్యాయులు కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, చౌడవరపు సునీత, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి లావణ్య కుమార్ పగిడిపల్లి సార్ ఊటుకూరి రామరత్నం కార్యాలయ సేవకుడు షేక్ నాగూర్, ప్రాథమిక పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు లంకా నాగేశ్వరరావు,యక్కిటిల కృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యాదానమే మహాదానం

## వెంకటాపురం పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**ఎర్రుపాలెం, జూన్ 18 (మనం న్యూస్) :** మండలం వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెల్లంకి నాగరాజు గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించిన ఉచిత పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు అనంతరం ఎర్రుపాలెం మండల కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి సుధాకర్ రెడ్డి రూ.2,000 విలువైన పలకలు బలపాలు పెన్సిళ్లు స్వీట్లు తదితర విద్యా సామగ్రిని నూతన విద్యార్థులకు అందజేశారు ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభిస్తున్న చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస రెడ్డి సొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్ది వెంకటేశ్వరరావు గ్రామ పెద్దలు వేముల



వెంకటేశ్వరరావు కుంపటి శ్రీను నవశకం నిర్వాహకులు మేకల రమేష్ విద్యార్థులను అభినందించి విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ రామారావు పారిశుద్ధ్య కార్మికురాలు గౌర్రాజు లక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

# బాణాల వెంకటరమణకి ఘన నివాళులర్పించిన గ్రామ సర్పంచ్

**ఎర్రుపాలెం, జూన్ 18 (మనం న్యూస్) :** మండల పరిధిలో బనిగండ్లపాడు గ్రామంలో బాణాల వెంకటరమణ కి దశదినకర్మ హాజరై నివాళులర్పించిన గ్రామ పెద్దలు సర్పంచ్ బలుసుపాటి జయరాజు పెద్ద గోపవరం సొసైటీ అధ్యక్షుడు శీలం అక్కి రెడ్డి ఉప సర్పంచ్ వేమిరెడ్డి రామి రెడ్డి గ్రామ సెక్రెటరీ అశోక్ కుమార్ వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి బాణాల శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.



మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



# మధిర

మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ

## ఎస్ఐ నరేష్‌ని కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**చింతకాని జూన్ 18 (మనం న్యూస్):** ఎస్ఐ నరేష్‌ను బిఆర్ఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు కురుగుంట్ల రవీందర్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు పిన్నెల్లి శ్రీనివాస్ నాయకులు శెట్టి మోహన్ రావు, శెట్టి సురేష్ బొమ్మకంటి అచ్చయ్య పాల్గొన్నారు.





## డిప్యూటీ సీఎం భట్టి కృషితో రూ.13 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్ మంజూరు

**ఎర్రుపాలెం, జూన్ 18 (మనం న్యూస్):** మండల పరిధిలో పనులను ప్రారంభించారు పనులను పరిశీలించి రోడ్ విస్తరణ లో భాగంగా రైతులతో భూములను గురించి చర్చించిన మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు జిల్లా ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి మండల అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్ రెడ్డి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు తలపురెడ్డి నాగిరెడ్డి మండల మైనార్టీ అధ్యక్షులు షేక్ జానిభాషా మండల నాయకులు యరమల శ్రీనివాస్ రెడ్డి, బాలరాజు బుచ్చిరెడ్డిపాలెం గ్రామ శాఖ అధ్యక్షులు జంగా శేషిరెడ్డి రైతులు తదితరులు నాయకులు పాల్గొన్నారు.



## ఎర్రుపాలెంలో ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ

**ఎర్రుపాలెం, జూన్ 18 (మనం న్యూస్) :** తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు మండల పార్టీ అధ్యక్షుడు ఎస్కే సుభానీ ఆధ్వర్యంలో మండల కేంద్రం ఎర్రుపాలెంలో తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చలసాని విష్ణుమూర్తి పార్టీ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారుఅనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రతిపాదించిన



పాంచజన్యం అనే ఐదు ప్రధాన అస్త్రాలు తెలంగాణ భవిష్యత్ నిర్మాణానికి సామాజిక తెలంగాణ స్థాపనకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు ఈ లక్ష్యాల సాధన కోసం ప్రతి తెలంగాణవాది కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ముందుకు రావాలని తెలంగాణ ప్రజల ఆశీస్సులు సహకారం పార్టీకి అందించాలని కోరారు అనంతరం నాయకులు కార్యకర్తలు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గ అబ్జర్వర్ అనిత చౌదరి రాష్ట్ర పార్టీ కార్యదర్శులు బానోత్ కిషన్ నాయక్ గుంటి సుందర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం నాగేంద్ర కుమార్ మధిర నియోజకవర్గ ఇన్చార్జి తదితరులు పాల్గొన్నారు.

మనం
సత్తుపల్లి
సత్తుపల్లి - వేంసూరు - పెనుబల్లి - కల్లూరు - తల్లాడ



# “డయల్ యువర్ ఎమ్మెల్యే”కు విశేష స్పందన



**సత్తుపల్లి, జూన్ 18 (మనం న్యూస్) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపాలనే లక్ష్యంతో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వేదికగా, వే2న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన “డయల్ యువర్ ఎమ్మెల్యే”కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నాం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఫోన్ ద్వారా తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సమస్యలతో పాటు ఇండ్ల పట్టాలు, పింఛన్లు, భూ వివాదాలు, విద్యా, వైద్య రంగాలకు సంబంధించిన పలు అంశాలపై ప్రజలు విన్నవించుకున్నారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అత్యంత ఓర్పుతో విన్నారు. సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేస్తూ, సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రజా పాలనకు నిదర్శనంగా నిలిచిందని పలువురు ప్రశంసించారు.



# అడసర్లపాడు అంగన్ వాడీ సెంటర్లో అక్షరాభ్యాసం

**వేంసూరు. జూన్ 18 (మనం న్యూస్) :**
మండల పరిధిలోని అడ సర్ల పాడు గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాజలం ఆధ్వర్యంలో గురువారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సెక్టార్ సూపర్వైజర్ గంగాజలం, పంచాయతీ సెక్రటరీ ఉపేందర్లు ప్రారంభించారు. ఆలాగే అదే గ్రామంలో బడిబాట ర్యాలీని సర్పంచ్ మల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో బడి బాట ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు పద్మశాలిని, విజయకుమారి, వెంకటమ్మ, నిర్మల, తల్లులు, పిల్లలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులకు తక్షణమే

# అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలి



**సత్తుపల్లి టౌన్, జూన్ 18 (మనం న్యూస్):** ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తక్షణమే జిల్లా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘాల యూనియన్ నాయకులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పత్రికలను ఏబీసీడీలుగా విభజించి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252 ద్వారా జర్నలిస్టుల హక్కులను కాలరాస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగిస్తున్న 252 జీవోను వెంటనే సవరించి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులందరికీ జిల్లా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి. అక్రిడిటేషన్లతో పాటు జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాలి. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులను తక్షణమే మంజూరు చేయాలి. జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయంపై మీడియా అకాడమీ వెంటనే స్పందించి, ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ప్రభుత్వం వెంటనే స్పందించని పక్షంలో జర్నలిస్టు సంఘాలకు అతీతంగా ఐక్యంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని నాయకులు ఈ సందర్భంగా హెచ్చరించారు. జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వాటిని తక్షణమే పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తోట కిరణ్, మాజీ అధ్యక్షులు సిహెచ్. బాలకృష్ణ, సీనియర్ రిపోర్టర్లు మాదిరాజు సుధాకర్, ఎండి. షైబుద్దిన్, షేక్ ఖాదర్ బాబా, రామ్మిశెట్టి లక్ష్మణరావు, తడికిమళ్ళ దేవ, భీమ్మిశెట్టి రాము, జె.శ్రీనివాసరావు, ఐ. శ్రీను, బాలాజీ, శ్రీకాంత్, మోహన్, గురవయ్య, సురేష్, అశోక్ , ఆనంద్, రామారావు, రాజేష్ రెడ్డి, గంగాధర్, మెహారాజ్, చిరంజీవి, జగన్, సాయి తదితర ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్టీసిలో మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**– సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలి**
**– సమస్యలు లేకుండా ప్రభుత్వంలో విలీన ప్రక్రియ చేయాలి**
**–ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మంలో మహిళా సదస్సు**



**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** తెలంగాణ ఆర్టీసీలో రీజనల్ మేనేజర్ స్థాయి అధికారి నుండి కండక్టర్ స్థాయి ఉద్యోగుల వరకు 4,500 మంది పైగా మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల సానుభూతితో వ్యవహరించాలని ప్రభుత్వానికి,యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన ఆర్టీసీ శ్రామిక మహిళా సదస్సు అనేక తీర్మానాలను ఆమోదించింది. గురువారం ఉదయం ఖమ్మం లోని కొండబోలు వెంకయ్య చౌదరి మీటింగ్ హాల్ లో డి.సరిత అధ్యక్షతన ఏర్పాటైన రాష్ట్ర స్థాయి ఆర్టీసీ మహిళా సదస్సు లో ఎస్.రమాదేవి వక్తలను వేదిక మీదికి ఆహ్వానించారు. ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను వ్యతిరేకించే పోరాటంలో మహిళలు ముందు భాగంలో నిలవాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ శ్రామిక మహిళ రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ జె.పద్మావతి సదస్సులో నోట్ ప్రవేశపెట్టారు. మహిళా కండక్టర్లకు ప్రతి బస్టాండ్ లో ప్రత్యేకంగా వాష్ రూమ్ లు ఏర్పాటు చేయాలని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులు వాడకుండా తగు చర్యలు తీసుకోవాలని, మహిళల కు ప్రకృతి సిద్ధమైన అవసరాలకు గాను నెలకు మూడు రోజుల ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని, మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటీ చార్ట్ ఏర్పాటు చేయాలని, రాత్రి 8 గంటల లోపు డ్యూటీ పూర్తయ్యే విధంగా డ్యూటీలను కేటాయించాలని, రాత్రి 8 గంటల తర్వాత బస్సు ఫెయిల్ అయితే మిగిలిన సర్వీస్ ను రద్దుచేసి మహిళా కండక్టర్ క్యాష్ రెమిట్ చేయుటకై తగు ఆదేశాలు జారీ చేయాలని, తనిఖీ అధికారుల్లో కొందరు ఉద్దేశపూర్వకంగా మహిళా కండక్టర్ పై చార్జిమెమోలు రాసి వేధింపులకు పాల్పడుతున్నారని, అటువంటి వాటిపై తగిన చర్యలు తీసుకొని మహిళా కండక్టర్లకు రక్షణ కల్పించాలని, ప్రతి డిపో, రీజియన్, జోనల్, హెడ్ ఆఫీస్ కేంద్రాలలో ‘లైంగిక వేధింపుల నిరోధక కమిటీ‘ ఏర్పాటు చేయాలని, సర్క్యులర్ లో పేర్కొన్న విధంగా సంస్థేతర మహిళలను కమిటీలో నియమించాలని,లైంగిక వేధింపులపై ఆ కమిటీ ఇచ్చే నివేదికపై తగు చర్యలు తీసుకోవాలని ప్రవేశపెట్టారు. నోట్ పై ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రాల శ్రీనివాసరావు ప్రసంగిస్తూ, ఆర్టీసీలో ఎక్కువ మంది మహిళా ఉద్యోగులు కండక్టర్లు గానే విధులు నిర్వహిస్తున్నారని కుటుంబ బాధ్యతలు ఒకవైపు,కండక్టర్ విధి నిర్వహణ మరోవైపు నిర్వహిస్తున్న వారికి వారు ఎదుర్కొనే సమస్యలు కూడా ఎక్కువగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఖమ్మం రీజయన్ లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ గుర్తింపు సంఘం గా మహిళలకు ప్రత్యేక డ్యూటీ చార్టులు వేయించడంలోనూ, ప్రతి డిపోలోనూ మహిళా విశ్రాంతి గదుల ఏర్పాట్లలోనూ, మహిళా సమస్యల పరిష్కారం లోనూ, ప్రత్యేక కృషిచేసి రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి ప్రభుత్వం ఆమోదించినందున ఆంధ్రప్రదేశ్ లో విలీనం సందర్భంగా సమస్యలు వచ్చినట్లుగా తెలంగాణ విలీనంలో రావద్దన్నారు .అందుకనే సమస్యలు లేకుండా విలీనం కోసం,సంపూర్ణ ఉద్యోగ భద్రత కోసం కేటగిరీల వారీగా సదస్సులు నిర్వహించి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల నుండి వస్తున్న అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని వాటిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి,యాజమాన్యానికి నివేదిస్తున్నామని తెలిపారు.

**ఆర్టీసీ శ్రామిక మహిళ రాష్ట్ర, ఖమ్మం రీజియన్ కన్వీనింగ్ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక**

ఆర్టీసీ శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ గా జె.పద్మావతి తో పాటు పదిహేను మందితో నూతన రాష్ట్ర సమన్వయ కమిటీ ని సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఖమ్మం రీజియన్ ఆర్టీసీ శ్రామిక మహిళ కన్వీనర్ గా డి.సరిత తో పాటు తొమ్మిది మందితో ఖమ్మం రీజియన్ నూతన కన్వీనింగ్ కమిటీ ని సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు గుండు మాధవరావు, పిట్టల సుధాకర్ నాయకులు హెచ్చు బసవయ్య, పగిళ్లపల్లి నరసింహారావు, తోకల బాబు, ఓరుగంటి రాంబాబు, జి.బాబు, సురేష్, మలక్ష్మి, పర్వీనా, సైదమ్మ, నూర్జహాన్, పద్మా, రమాదేవి, సుధారాణి, విజయలక్ష్మి, మల్లికాంబ, ఎం.డి.ఎం బేగం. సీతమ్మ, రమా, లక్ష్మి, భాగ్యలక్ష్మి, జ్యోతి, మంజుల, శిరీష రాణి, మల్లికాంబ, లక్ష్మి భవాని తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్‌ను పునఃప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని






**కొత్తగూడెం టౌన్ జూన్ 18 (మనం న్యూస్) :** భద్రాద్రికొత్తగూడెం జిల్లా: కొత్తగూడెం పట్టణంలోని జిల్లా ప్రెస్ క్లబ్ ను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పునఃప్రారంభించారు. మేయర్ మూడ్ గణేష్, డి.ఎస్.పి ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.... కొత్తగూడెం పట్టణంలోని జిల్లా ప్రెస్ క్లబ్ ను పునఃప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జర్నలిస్టు మిత్రులందరికీ శుభాకాంక్షలు, జర్నలిస్టులందరూ అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉండాలని సూచించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో అనేక సార్లు అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందని అందులో భాగంగా కొత్తగూడెం పట్టణంలో పది ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని జర్నలిస్టుల కోసం కేటాయించడం జరిగిందన్నారు. త్వరలోనే ప్రభుత్వ అనుమతితో ఇళ్ల ఫలాలు వస్తాయన్నారు. జర్నలిస్టు మిత్రులందరికీ ఎటువంటి గొడవలు పెట్టుకోకుండా సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాజీ జడ్జ్ రాజమల్లు వివిధ పత్రిక రిపోర్టర్ మోటమర్రి రామకృష్ణ లోగాని శ్రీనివాస్ కల్లోజు శ్రీనివాస్ వెలుగు రాజేందర్ ఎర్ర ఈశ్వర్ షఫీ రవి శంకర్ నవీన్ నరసింహ పాపారావు కృష్ణంరాజు కుమార్ సతీష్ ఉమాకాంత్ ఉదయ్ రాము మురళి శ్యామ్ చదలవాడ సూరి అఫ్జల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ సమావేశం రసాభాస

**– ఎమ్మెల్సీ రవీందర్ -- వనమా రాఘవ వ్యాఖ్యలతో కార్యకర్తల ఆందోళన**
**– కుర్చీలు విరగ్గొట్టి నిరసన.. కాసేపు ఉద్రిక్తత.. చివరికి ఐక్యతకు నేతల పిలుపు**





**కొత్తగూడెం టౌన్ జూన్ 18 (మనం న్యూస్) :** బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు, బూత్ కమిటీ బలోపేత కార్యక్రమం సందర్భంగా కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ ప్రసంగంలో వనమా రాఘవ ప్రస్తావన రావడంతో కొందరు కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేయగా సమావేశం కొంతసేపు రసాభాసగా మారింది. సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల ఏర్పాటు భవిష్యత్ కార్యాచరణపై నాయకులు మాట్లాడుతుండగా రవీందర్ చేసిన వ్యాఖ్యలపై వనమా రాఘవ అనుచరులు స్పందించారు. కొందరు కార్యకర్తలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేయగా ఆవేశంలో కొందరు కుర్చీలు విరగ్గొట్టినట్లు సమాచారం. దీంతో సభా ప్రాంగణంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో వేదికపై ఉన్న వనమా రాఘవ అసంతృప్తితో స్టేజి నుంచి కిందికి దిగి వెళ్లేందుకు ప్రయత్నించగా కార్యకర్తలు ఆయనను సముదాయించారు. అనంతరం పలువురు సీనియర్ నాయకులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. పార్టీ ఐక్యతను దృష్టిలో ఉంచుకుని సమావేశాన్ని కొనసాగించాలని కోరడంతో రాఘవ తిరిగి వేదికపైకి వచ్చారు. అయితే ఉద్రిక్తత మధ్య కూడా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ వనమా రాఘవపై సానుకూల వ్యాఖ్యలు చేయడం విశేషంగా నిలిచింది. రాఘవకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని యువ నాయకుడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడే నాయకులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని వనమా రాఘవకు కూడా తన పూర్తి సహకారం కొనసాగుతుందని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. ఇక వనమా రాఘవ కూడా కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇరువురు నాయకులు సమావేశ వేదికపైనే పరస్పరం మాట్లాడుకుని పరిస్థితిని చల్లార్చేందుకు ప్రయత్నించారు. పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేస్తేనే బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని నేతలు అభిప్రాయపడ్డారు. కాసేపు ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ చివరకు నాయకుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం తిరిగి కొనసాగింది. సమావేశం ముగిసే సమయానికి కార్యకర్తలకు ఐక్యత, క్రమశిక్షణ, సమిష్టి కృషి అవసరమని నేతలు పిలుపునిచ్చారు. సభ ప్రారంభంలో కనిపించిన ఉద్రిక్తత చివరకు ఐక్యత సందేశంతో ముగియడం సమావేశంలో ప్రత్యేకంగా నిలిచిన అంశంగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని నాయకులు సంకల్పం వ్యక్తం చేశారు.





మనం
జనం కోసం అక్షర యజ్ఞం.
కొత్తగూడెం
కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి



# రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోంది

**– కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్ సింగ్ నాయక్**



**కొత్తగూడెం టౌన్ జూన్ 18 (మనం న్యూస్):** రైతుల పక్షపాతి గా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉందని రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్సింగ్ నాయక్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మార్కెట్ కమిటీలకు చైర్మన్ ల తో పాటు నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కొత్తగూడెం జిల్లా మార్కెట్ కమిటీకి ఎస్టీ జనరల్ కావడంతో చైర్మన్గా బానోత్ లాల్ సింగ్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉందని వ్యవసాయ మార్కెట్ను ప్రక్షాళన చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని అన్నారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు ఉపయోగపడే పనులు చేస్తామని రైతుల అవసరాలకు అనుగుణంగా నడుచుకొని తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అంతఃకరణ శుద్ధితో నిర్వర్తిస్తానని అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయని అన్నారు. రోజు రోజుకు ప్రజా ప్రభుత్వానికి వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేకనే ఇతర పార్టీలో బురద జల్లుతున్నాయని మరల రాబోయేది కచ్చితంగా ఇందిరమ్మ రాజ్యమే అని అన్నారు. ఆయనతోపాటు వైస్ చైర్మన్ గా భూక్య జనార్ధన్, సభ్యులుగా అజ్మీర అమృ, జోగా రామయ్య మాలోత్ అశోక్ బాబు రవి తేజవత్ శివ ఓకే నాగేశ్వరరావు తేజావత్ రవికుమార్ వాడే లక్ష్మి ఇస్లావత్ హరిలాల్ సభావత్ రవి , ఖమ్మంపాటి రమేష్ సత్యనారాయణ ధరక్, ఎక్స్ అఫీషియో సభ్యులుగా సొసైటీ చైర్మన్ జిల్లా మార్కెటింగ్ అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సంజయ్ నగర్ పంచాయతీ చైర్పర్సన్లను నియమించారు.

# నిజాయితీగా సెల్ ఫోన్ అప్పగించిన న్యూస్ రిపోర్టర్



**దమ్మపేట,జూన్ 18 (మనం న్యూస్ ) :** దమ్మపేట ప్రధాన రహదారిపై న్యూస్ సీనియర్ రిపోర్టర్ సతీష్‌కు టచ్ సెల్ ఫోన్ దొరికింది. ఆయన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫోన్‌ను అప్పగించారు. దీనిపై ఎస్సై బాలస్వామినాథం దర్యాప్తు చేపట్టి, సెల్‌ఫోన్ యజమాని చిన్నగొల్ల గూడెం గ్రామానికి చెందిన రాజిని ప్రసాద్‌గా గుర్తించారు. అనంతరం సీఐ నాగరాజు చేతుల మీదుగా ఫోన్‌ను యజమానికి అందజేశారు. సెల్‌ఫోన్‌ను నిజాయితీగా అప్పగించిన సతీష్‌ను పోలీసులు అభినందించారు.

మనం
మనం కోసం అక్షర యజ్ఞం



# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

## ఎఎన్ఎంలకు సబ్ సెంటర్ల కేటాయింపు కౌన్సిలింగ్

**– డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్**

**– సీనియారిటీ ఆధారంగానే కేటాయింపు**

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 (మనంప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జి ఓ ఎంఎస్ నం: 38 ప్రకారం చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా, జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించబడిన 54 మంది మహిళ ఆరోగ్య కార్యకర్తలకు (ఎఎన్ఎం) పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి ఆయా ఆరోగ్య ఉప కేంద్రాలు కేటాయించినట్లు జిల్లా వైద్య డి ఎం అండ్ హెచ్ ఓ తుకారామ్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో ఎఎన్ఎంల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉండి తల్లి–శిశు ఆరోగ్య సేవలు, గర్భిణీల నమోదు, క్రమానుసార ఎఎన్సి పరీక్షలు, హై రిస్క్ కేసుల గుర్తింపు, సాధారణ ప్రసవాల ప్రోత్సాహం, ప్రసవానంతర సేవలు, నవజాత శిశు సంరక్షణ, పూర్తి స్థాయి టీకాల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ సేవలు, కౌమార బాలికల ఆరోగ్య సేవలు, రక్తహీనత నివారణ, సికిల్ సెల్ అనీమియా స్క్రీనింగ్, అసంక్రమిత వ్యాధుల (బిపి, మధుమేహం) స్క్రీనింగ్ వంటి సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కౌన్సిలింగ్ ద్వారా సబ్ సెంటర్లు కేటాయించబడిన వారు వారి విధులను సక్రమంగా నిర్వహించాలని విధులలో అలసత్వం, నిర్లక్ష్యం, వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

## ఆధునికీకరణతో మారనున్న రాతిచెరువు రూపురేఖలు

- రూ.2.30కోట్లతో రాతి చెరువు అభివృద్ధిపనులు చేపడుతున్నాం.
- అభివృద్ధికి చిరునామాగా పాల్వంచను తీర్చిదిద్దుతాం
- నిర్ణీత కాలంలోగా నాణ్యతతో పనులు ముగించేలా చర్యలు తీసుకుంటాం
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- రూ.2.76కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన





**పాల్వంచ, జూన్ 18(మనం న్యూస్):** రూ.2.30కోట్ల నిధులతో చేపట్టనున్న రాతిచెరువు ఆధునికరణతో చెరువు రూపురేఖలు మారుతాయని, రాతి చెరువు పరిసరాలు ఎంతగానో ఆహ్లాదంగా మారుతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో రూ.2.30 కోట్లతో చేపట్టనున్న రాతి చెరువు అభివృద్ధి పనులకు, అలాగే రూ.76 లక్షల నిధులతో నిర్మించనున్న రెండు నూతన రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. రూ.2.30 కోట్లతో రాతి చెరువు సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, ఇతర ఆధునీకరణ పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. అభివృద్ధికి చిరునామాగా పాల్వంచను తీర్చిదిద్దుతామని, నియోజకవర్గంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయని వివరించారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా తాము నిరంతర కృషి చేస్తున్నామని, నియోజకవర్గ పరిధిలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరిన్ని నిధులు తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత కాలవ్యవధిలోగా పనులు ముగించేలా చర్యలు తీసుకుంటామని, ఆ మేరకు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. భవిష్యత్తులో కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతిపల్లెకు, బస్తీకి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, తహసిల్దార్ దారా ప్రసాద్, ఇంచార్జీ కమిషనర్ విజయానంద్, ఎలక్ట్రికల్ ఏ డీ ఈ అబ్దుల్ రెహమాన్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, గొర్లె అన్నపూర్ణ, కాల్వ భాస్కర్, దున్నపోతుల మణి, దంతబోయిన నరేష్, నాయకులు పద్మజ, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శెనగారపు శ్రీనివాసరావు, ఎస్ ఏ రెహమాన్, వైఎస్ గిరి, గౌస్ పాషా, మస్తాన్, అహ్మద్ జానీ, కరీం, గొర్లె నరేష్, నామ పండు, ఆలపాటి ప్రసాద్, అల్లి వెంకటేశ్వర్లు వివిధ శాఖల డి ఈ లు ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కిన్నెరసాని తెలంగాణకు జీవనాడి వంటిది



- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- జిల్లాలో 55 లక్షల మొక్కల నాటడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ అంకిత్
- వనమహోత్సవ కార్యక్రమాన్ని వర్చువల్ గా ప్రారంభించిన సీఎం




**పాల్వంచ, జూన్ 18(మనం న్యూస్):** రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హరిత కార్యక్రమాలతో పాటు కిన్నెరసాని వన్యప్రాణి నిర్వహణ కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో భాగంగా కిన్నెరసాని వన్యప్రాణి నిర్వహణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం రూ 45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సఫారీ వాహనాలు, ట్రెక్కింగ్ సౌకర్యం, బటర్‌ఫ్లై పార్క్, జింకల పార్కులో ఫీడింగ్ షెడ్, సీసీ రోడ్డు తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న జిల్లాగా గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అని పేర్కొన్నారు. కిన్నెరసాని తెలంగాణకు ఊపిరితిత్తుల వంటిదని అన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు పోడు భూములపై హక్కులు కల్పించడంతో పాటు కొత్తగా అటవీ భూముల ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కిన్నెరసానిని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కిన్నెరసానిలో తీగల వంతెన నిర్మాణం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, అద్దాల మేడ, జూ పార్కు, బోటు షికారు, పర్యాటక హోటల్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మణుగూరులోని వేడి నీటి గుంతల ప్రాంతం వరకు కిన్నెరసాని సఫారీ కారిడార్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా అతి త్వరలో కొత్తగూడెం పట్టణానికి రూ.500 కోట్ల వ్యయంతో రింగ్ రోడ్డు, అతి పెద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి మంజూరుకు చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. అటవీ సంపద పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లాలో హరితాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 50 శాతం భూభాగం అటవీ ప్రాంతంగా ఉందని, జిల్లా ప్రజల జీవన విధానం అడవులతో ముడిపడి ఉందన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 55 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 42 శాఖలకు మొక్కల నాటే బాధ్యతలను కేటాయించామని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. గత 24 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రాత్రి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవడం ఆందోళనకర విషయమని, పర్యావరణ సమతుల్యత కోసం విస్తృత స్థాయిలో మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు మొక్కల సంరక్షణపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నాటిన మొక్కల్లో కనీసం 95 శాతం మొక్కలు వృక్షాలుగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం అని తెలిపారు. జిల్లాలో సుమారు ఎనిమిది లక్షల ఎకరాల అటవీ భూమి ఉన్నదని పేర్కొన్నారు. గతంలో కొంత మేర అటవీ భూమిని కోల్పోయినప్పటికీ ప్రస్తుతం అటవీ సంపద పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అభివృద్ధి, అటవీ సంరక్షణ, గిరిజనుల సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా కిన్నెరసానిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు..అనంతరం సఫారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సర్పంచ్ వజ్జా రామకృష్ణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎఫ్డిఓ లు బాబు, చారి, తాసిల్దార్ ధారా ప్రసాద్, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు.

మనం




# అశ్వారావుపేట

అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చంద్రుగొండ - ములకలపల్లి

# రైతన్నల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**దమ్మపేట,జూన్ 18(మనం న్యూస్)**
ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధుల విడుదలకు తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయం.మధిర నియోజకవర్గంలో నిర్వహించ నున్న భారీ బహిరంగ సభ వేదికగా రైతు భరోసా నిధులను విడుదల చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం రైతాంగానికి మరింత భరోసా కల్పించనుంది.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి,రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,కి దమ్మపేట మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.రైతు కష్టానికి గుర్తింపు.వ్యవసాయానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి భరోసా మాటల్లో కాదు చేతల్లో చూపిస్తున్న ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతాంగం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది అనే సంకల్పంతో ముందుకు సాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అభినందనలు తెలియజేసిన దమ్మపేట మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు.



# దమ్మపేట చిరు వ్యాపారులకు అభయహస్తం

## – పంచాయతీ స్థలంలో షాపుల నిర్మాణానికి ముగ్గు పోసిన పాలకవర్గం





**దమ్మపేట, జూన్ 18: (మనం న్యూస్ ):** దమ్మపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీకి చెందిన స్థలంలో షాపుల నిర్మాణానికి ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి ఉంది. గురువారం భూమి పూజ నిర్వహించి షాపులు నిర్మాణం చేయుటకు ఇంజనీర్ చే ముగ్గు పోశారు. 9 సం.ల క్రితం వరకు ఇట్టి స్థలంలో సంత నిర్వహించబడేది. ప్రస్తుతం సంత కొట్టులు రాజీవ్ గాంధీ సెంటర్ వైపు మళ్ళడం తో ఖాళీగా ఉన్న ఇట్టి పంచాయతీ ప్రదేశంలో కొత్తగా ఏర్పడిన పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించి శుభ్రం చేయించి, షాపులు నిర్మాణం కొరకు గురువారం గ్రామ పెద్దల సమక్షంలో మొత్తం 19 షాపులకు ముగ్గు పోశారు. ఈ సందర్భంగా కార్యదర్శి బండి అనంత్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా దమ్మపేట ప్రధాన రహదారి ఇరువైపుల గల డ్రైనేజీలపై ఆక్రమణ చేసిన వ్యాపారులకు నోటీసులు పంపించి ఖాళీ చేయాలని చెప్పడంతో పూర్తిగా డ్రైనేజీ షాప్ లు నిర్వహిస్తున్న వ్యాపారులు తమకు ప్రత్యామ్నాయ స్థలం కావాలి అని సర్పంచ్ ని కోరినందున 19 షాపులకు లాటరీ ద్వారా లీజు కేటాయింపు అధికారిక నిబంధనలు తప్పనిసరి తో లీజు వ్యవధి, నెలవారీ అద్దె చెల్లింపులు, నిర్వహణ నియమాల పై త్వరలో ఎవరైతే పూర్తిగా డ్రైన్ల పై వ్యాపారం చేస్తున్న వారికి ముందుగా అవకాశం అని తెలియజేశారు. జూన్ 20 వ తేదీన దమ్మపేట ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రైన్ల ఆక్రమణలను జే. సి.బి తో తొలగిస్తామని చెప్పారు. ఇప్పటికే పలు మార్లు ప్రతీ షాప్ యజమానికి నోటీస్లు ఇచ్చామని, మైక్ పెట్టి ప్రచారం చేశాం అని, ఇక అవకాశం ఇవ్వలేము అని డ్రైన్ పై నుండి రోడ్డు మధ్యలో షాప్ బోర్డు లు కూడా తొలగించాలి అని తెలియజేశాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, గ్రామస్తులు పగడాల రాంబాబు, చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, గోపి, ముక్తేశ్వరరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, దాసరోజు రామారావు, రామబ్రహ్మం, పందూరి వీరబాబు, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, గట్ల సర్వేశ్వరరావు, శ్రీను, నాగరాజు, నల్లగట్ల సత్యంబాబు, వనమాల సూరిబాబు, ఏలూరి సత్తిబాబు, దేవయ్య, తిరువీధుల శ్రీను, పగడాల గోపి, భాస్కర్, పంచాయతీ సిబ్బంది మహాదేవ సాయి, కాకాని గణేష్, భీమా శ్రీనివాసరావు, కొప్పర్తి సింగ్ తదితరులు ఉన్నారు.

# విద్యుత్ సౌకర్యం లేని ప్రాంతానికి విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**దమ్మపేట, జూన్ 18 (మనం న్యూస్) :** దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో గల మల్లారం శివారులో సుమారు 80 కుటుంబాలు పైగా ఆరు సంవత్సరాలుగా కరెంట్ సదుపాయం లేకుండా నివాసం ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,దృష్టికి దమ్మపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు పగడాల రాంబాబు, కక్కిరాల రమేష్ తదితర నాయకులు తెలియజేసి గత పది రోజుల క్రితం విద్యుత్ శాఖ ఏఈ సమక్షంలో అక్కడ నివాసం ఉంటున్న వాసులకు ప్రభుత్వం ఒక కిలోమీటర్ పరిధిలో గల నివాసల కు ఎలాంటి చార్జీలు లేకుండా కరెంట్ లైన్ సదుపాయం చేసే అవకాశం కల్పించిందని తెలియజేశారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం 20కి పైగా కరెంటు స్తంభాలను ఆ నివాసల మధ్య పాతించారు. ఈ సందర్భంగా నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు మాట్లాడుతూ కరెంట్ లేని ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షించే విషయం అని, ఇప్పటికే తమ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్న తరుణంలో, విద్యుత్ సౌకర్యం లేని దూర ప్రాంతాలకు కూడా కరెంటు లైన్లు చార్జీలు లేకుండా చేస్తున్న తీరు దేశంలో ఎక్కడ లేదు అన్నారు. చార్జీలు లేకుండా కిలోమీటర్ పరిధిలో గల ప్రాంతాలకు కరెంట్ లైన్ లాగి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి క్యాబినెట్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రూపా రాంబాబు, చిన్నశెట్టి గోపి, అప్పారావు, మళ్ళా చిన్నా, మణికంత తదితరులు ఉన్నారు.

# నలుగురు వేటగాళ్లను అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు

## – నాటు తుపాకీ ఆరు తూటాలు స్వాధీనం



**దమ్మపేట,జూన్ 18(మనం న్యూస్):**
దమ్మపేట మండలం గండుగులపల్లి బీట్ పరిధిలో అనుమానాస్పదంగా వేటకు వచ్చిన నలుగురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బీట్ ఆఫీసర్ భవాని సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నిందితులు.చిలకా వెంకటేష్,(26) కేసరి శివాజీ గణేష్ (24) దుంప నితిన్(24) దార బోయిన నాగేశ్వరరావు (37) వారు పారిపోతుండగా పట్టుకొని రెండు బైకులు నాటు తుపాకి ఆరు తూటాలు టార్చ్ లైట్ బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నలుగురిని అరెస్టు చేసి వైల్డ్ యాక్ట్ కేసు నమోదు చేశారు.

# అనారోగ్య బాధితులను పరామర్శించిన సిపిఎం జిల్లా నాయకులు



**దమ్మపేట,జూన్ 18 (మనం న్యూస్)**
: ,దమ్మపేట మండలం శ్రీరాంపురం గ్రామంలో రైతుసంఘం మండల కార్యదర్శి.పార్టీ మండల కమిటీ సభ్యులు మోరంపూడి కేశవరావు తల్లి వెంకమ్మను నాయుడుపేట గ్రామంలో పార్టీ మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మి నారాయణ తల్లి సత్యావతి ని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య పరామర్శించారు. మోరంపూడి వెంకమ్మ ,దొడ్డా సత్యావతి, అనారోగ్యం కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారిని వారి గృహాలకు వెళ్ళి పరామర్శించారు. వారు త్వరగా కోలుకోవాలని కోరారు. లక్ష్మినారాయణ ,కేశవరావు,లను మీ తల్లులను జాగ్రత్తగా చూసుకోవాలని చూచించారు. ఈకార్యక్రమంలో మోరంపూడి రామారావు, దొడ్డా లక్ష్మినారాయణ,ఎస్ కే జాన్ పాషా,దొడ్డా వెంకట రామ సత్యనారాయణ, కొంగర రమేష్ , కొంగర సురేష్.దొడ్డా లక్ష్మి, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేస్తున్న విమర్శలు అర్ధరహితమైనవి

## –మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి



**అశ్వరావుపేట జూన్ 18 (మనం న్యూస్) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మాజీమంత్రి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలను మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్మ రాంబాబు కాంగ్రెస్ శ్రేణులు అర్ధర హితంగా కొట్టిపారేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే, ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణల నుంచి దృష్టి మరల్చేందుకే ప్రతిపక్షాలు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాయని, ప్రజల నుంచి పొంగులేటిని దూరం చేయ డం కేటీఆర్ కుసాధ్యం కాదన్నారు. ఇటువంటి దిగజారుడు విమర్శలు మానుకోవాలని, నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న పొంగులేటి ని విమర్శిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మనం



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం

## డిగ్రీ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ



**భద్రాచలం,జూన్ 18 (మనం న్యూస్ ):** భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుబంధ మెంటర్ షిప్ కార్యక్రమానికి అనుబంధంగా డిజిటల్ లెర్నింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రధానా చార్యులు ఆచార్య జాన్ మిల్టన్ ప్రారంభి ంచారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని జూన్ 18,19 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదవ సెమిస్టర్‌లో భాగంగా తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్లుగా డాక్టర్ బి.వి.రావు, డాక్టర్ ఎస్.శ్రీలత, రమేష్ వ్యవహరిస్తున్నారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ శ్రద్ధా మేడమ్ విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్, పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య జాన్ మిల్టన్ మాట్లాడుతూ, ఈ తరగతుల ద్వారా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకొని తమ జీవితంలో వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐక్యూఏసీ కోఆర్డినేటర్ హవిలా మేడమ్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### - మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య.



**దుమ్ముగూడెం జూన్ 18 (మనం న్యూస్):** దుమ్ముగూడెం మండల కేంద్రం లక్ష్మీనగరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఆధార్ సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండలానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఈ ఆధార్ సేవ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం లక్ష్మీనగరం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కేంద్రం సేవలను దుమ్ముగూడెం మండల విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఆధార్ నమోదు, బయోమెట్రిక్ నవీకరణ, మొబైల్ నంబర్ నమోదు, చిరునామా మార్పు తదితర ఆధార్ సేవలు పాఠశాలలోనే అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన ఆధార్ సేవల కేంద్రాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆధార్ కేంద్ర నిర్వహకులు కె. రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సేవలను వినియోగించుకొని ఆధార్‌కు సంబంధించిన సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

## రామయ్యని దర్శించుకున్న ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్



**భద్రాచలం ,జూన్ 18( మనం న్యూస్):** ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ ,భద్రాద్రి కొత్తగూడెం జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. గురువారం నాడు సాయంత్రం స్వామివారి దర్శనానికి వచ్చిన శివకుమార్ ,జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ను దేవస్థానం పర్యవేక్షకుడు సాయిబాబా మరియు అర్చక స్వాములు ఘనంగా స్వాగతం పలికారు. బలపీఠం వద్ద ప్రత్యేక పూజలు జరిపి గర్భగుడిలో పూజలు నిర్వహించిన అనంతరం లక్ష్మీ తాయారు అమ్మ వారిని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు స్వామివారి పట్టు వస్త్రాలను అందించి స్వామివారి విశిష్టతను తెలిపి తీర్థ ప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం డిప్యూటీ తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు ,అర్చక స్వాములు పాల్గొన్నారు.

## గుర్రంగూడ ఎకోపార్క్‌లో వనమహోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో కలిసి పాల్గొన్న పొదెం వీరయ్య



**భద్రాచలం, జూన్ 18 (మనం న్యూస్ ):**హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ సమీపంలో ఉన్న గుర్రంగూడ ఎకోపార్క్‌లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖలతో కలిసి తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం గుర్రంగూడ ఎకోపార్క్‌లో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తరణ, పచ్చదనం పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు, రాష్ట్ర వ్యాప్త అభివృద్ధి కార్యక్రమాలు వర్చ్యువల్ గా ప్రారంభోత్సవం చేసారు.అలాగే గుర్రంగూడ ఎకోపార్క్‌లో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాల్ హౌస్ వద్ద మొక్కలు నాటి వానమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.35.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.అదేవిధంగా గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు పర్యాటక అభివృద్ధికి, జీవ వైవిధ్య పరిరక్షణకు, పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలందరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు, రాష్ట్ర, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వలస ఆదివాసిలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

### - గద్దమడుగు, కొత్తపల్లి గ్రామల కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో డిఎస్పి అరుణ్ కుమార్



**దుమ్ముగూడెం జూన్ 18 (మనం న్యూస్):** వలస ఆదివాసీలకు మౌలిక వసతులు కల్పించడమే జిల్లా పోలీస్ లక్ష్యం అని వారి సంక్షేమం అభివృద్ధి కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని డి.ఎస్.పి అరుణ్ కుమార్ అన్నారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు గురువారం దుమ్ముగూడెం మండలం వలస ఆదివాసి గ్రామం గద్దమడుగు గుంపు, కొత్తపల్లి గ్రామంలో దుమ్ముగూడెం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో డీఎస్పీ అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలలోని యువత,పిల్లలు విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీస్ కి సమాచారం అందించాలని కోరారు.వర్షాకాలంలో తమ ఇండ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,అధికంగా మురుగు నీరు చేరడం వలన దోమలు అధికమై డెంగ్యూ,మలేరియా,టైఫాయిడ్ వంటి విషపూరిత జ్వరాల బారిన పడే అవకాశం ఉందని వాటి పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు.గంజాయి,మత్తు పదార్థాల వలన కలిగే జీవితాలు నాశనం అవుతాయని దుష్ప్రభావాలను గ్రామస్తులకు వివరించారు. ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లుగాని, వినియోగిస్తున్నట్లుగాని తెలిస్తే సమాచారాన్ని పోలీసు కి సమాచారం తెలియవలసినదిగా కోరారు. ఓటీపీలు ఎవరికి షేర్ చేయవద్దని, అనవసర లింకులు క్లిక్ చేయవద్దని విజ్ఞప్తి చేస్తూ సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్లు ధరించాలని, రోడ్డు భద్రత పై అవగాహన ఉండాలని సూచనలు చేశారు. అనంతరం గ్రామ ప్రజలకు గృహ అవసర వస్తువులను, పిల్లలకు పలకలు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటప్పయ్య ఎస్సై జగన్మోహన్ చారి, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

## నిజాయితీకి నిదర్శనం

### మర్చిపోయిన నగదు బ్యాగును తిరిగి అప్పగించిన మెడికల్ షాపు యజమాని

**భద్రాచలం , జూన్ 18( మనం న్యూస్):** ప్రస్తుత సమాజంలో కూడా మానవత్వం, నిజాయితీ ఇంకా బతికే ఉన్నాయని నిరూపించారు సాయి సందీప్ వెటర్నరీ మెడికల్స్' యజమాని హరిబాబు.స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు చెప్పుల వ్యాపారం చేసుకునే ఒక వ్యక్తి మర్చిపోయిన నగదు, బ్యాగును, తిరిగి అప్పగించి అందరి మన్ననలు పొందారు.స్థానిక ఎస్‌బిఐ బ్యాంకు ముందు చెప్పులు అమ్ముకునే వ్యక్తి, నిన్న రాత్రి 7 గంటల సమయంలో తన సరుకును సర్దుకుని ఇంటికి వెళ్లే క్రమంలో, పొరపాటున నగదు ఉన్న బ్యాగును అక్కడే వదిలేశారు. రాత్రి 9 గంటల సమయంలో తన షాపు మూసి ఇంటికి వెళ్తున్న సాయి సందీప్ వెటర్నరీ మెడికల్స్' యజమాని హరిబాబు, ఆ బ్యాగును గమనించి దానిని జాగ్రత్తగా తన షాపులో భద్రపరిచారు.అటువైపు, బ్యాగు గల్లంతయిందని గుర్తించిన చెప్పుల వ్యాపారి రాత్రి 12 గంటల తరువాత వచ్చి బ్యాగ్ లేక నిరాశతో వెనుదిరిగారు. గురువారం ఉదయం తన బాధను తోటి వ్యాపారులకు చెప్పుకుంటుండగా, విషయాన్ని తెలుసుకున్న హరిబాబు, సదరు వ్యక్తిని పిలిపించి, ఆ బ్యాగును వ్యాపారుల సమక్షంలో తిరిగి అప్పగించారు. ఆ బ్యాగులో తన పిల్లల స్కూలు ఫీజులు, పుస్తకాల కోసం దాచుకున్న సుమారు 35 వేల రూపాయలు యధాతథంగా ఉండటంతో, సదరు వ్యాపారి నిరాశ తో ఉదయం నుండి ఏమి తినలేదు అని హరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.ఎవరూ చూడని సమయంలో, ఆ నగదును తన సొంతం చేసుకోవాలనే ఆలోచన ఏమాత్రం లేకుండా, బ్యాగ్ యజమానిని వెతికి మరీ అందించిన హరిబాబు నిజాయితీని స్థానిక వ్యాపారులందరూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అధ్యక్షులు పరిమి సోమశేఖర్ పాల్గొని, హరిబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి ఆదర్శవంతమైన వ్యక్తులు ఉండటం మన ప్రాంతానికే గర్వకారణమని వారు పేర్కొన్నారు.



# మీ సహకారం మరువలేనిది..

## – వీడ్కోలు సభలో కార్యదర్శి సురేష్







**చర్ల, జూన్ 18 (మనం న్యూస్) :** మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన రెండేళ్ల కాలంలో గ్రామస్తులు, అదికారులు, సిబ్బంది, నూతన పాలకవర్గం సహకారం మరువలేనిదని కార్యదర్శి తోకల సురేష్ అన్నారు. రెండేళ్ల పాటు కార్యదర్శిగా విదులు నిర్వహించి ఇటీవల జరిగిన బదిలీలలో పెనగడప పంచాయతీ కార్యదర్శిగా నియమితులైన సురేష్ కు గురువారం పంచాయతీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఘణంగా సన్మానించిన పాలకవర్గం వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా సర్పంచ్ పూజారి సామ్రాజ్యం అద్యక్షతన జరిగిన ఆత్మీయ వీడ్కోలు సభకు ముఖ్య అతిదిగా మండల పరిషత్ అభివృద్ధి అదికారి కనపర్తి ఈదయ్య హాజరయి ప్రసంగించారు. ప్రతి ఉద్యోగికి బదిలీ అనేది సాదారణ విషయమేనని పేర్కొన్నారు. తన సొంత ఊరిలో విదులు నిర్వహించిన సురేష్ ఉత్తమ సేవలను అందచేసి మాతృభూమి రుణం తీర్చుకున్నారని ప్రసంశించారు. ఉద్యోగి బదిలీపై ఎక్కడికి వెల్లిన అంకిత భావంతో పనిచేసి ప్రజలకు సేవలందించాలని కోరారు. మండల పంచాయతీ అదికారి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ అదికారులు, కార్యదర్శులు ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేసారు. సర్పంచ్ సామ్రాజ్యం మాట్లాడుతూ తమ పాలకవర్గం ఎన్నికయిన ఏడు నెలల కాలంలో కార్యదర్శి తమకు సహాయ సహకారాలను అందచేసి గ్రామాభివృద్ధికి కృషి చేసారన్నారు. ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జున్ రావు మాట్లాడుతూ పాలకవర్గం లేని సమయంలో కార్యదర్శిగా సురేష్ సమర్థవంతంగా పనిచేసారని గుర్తుచేసారు. ఎన్నో ఒడిదుడులకు ఎదుర్కొని పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించారని ప్రసంగించారు. బదిలీపై వెల్లిన సురేష్ మాట్లాడుతూ 2015 నుండి చర్ల మండలంలోని వివిద పంచాయతీలలో కార్యదర్శిగా విదులు నిర్వహించినట్లు వెల్లడించారు. గత రెండేల్ల పాటు చర్ల మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి పంచాయతీకి గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చడం సంతృప్తి నిచ్చిందని పేర్కొన్నారు. ఇన్నాల్లూ తనకు సహకరించిన మండల ప్రజలకు, అదికారులకు, సర్పంచ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సురేష్ తో పాటు నూతన కార్యదర్శి గా బాద్యతలను చేపట్టిన రాంబాబును సర్పంచ్, ఉప సర్పంచ్ నేతృత్వంలోని పాలకవర్గం, పాత్రికేయులు ఘణంగా సన్మానించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గుండుపూడి భాస్కర్ రావు, సమ్మక్క, రాణి, శివ, సంతోష్ పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన ఆదివాసీ యువత ప్రచారం

**చర్ల, జూన్ 18 (మనం న్యూస్) :** ఈనెల 21 వ తేదీన మండలంలోని సుబ్బంపేట పంచాయతీ ఎదిరగుట్డల వద్ద జరగనున్న సమావేశం విజయవంతం చేయాలని కోరుతూ జిఎస్పి వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం. వరప్రసాద్ నేతృత్వంలో ఆదివాసీ యువత గ్రామగ్రామాన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఊరు ప్రతి గూడెం నుండి యువత తరలి రావాలని విజ్ఞప్తి చేసారు. ఆదివాసీ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఏజెన్సీ ప్రాంతంలో హక్కులను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ప్రచారంలో బాగంగా ఆయా గ్రామాలలోని యువత, సర్పంచ్ లకు వివరిస్తూ ప్రతి గూడెం, ప్రతి ఇంటి నుంచి ఒక ఉద్యమకారుడు తయారు కావాలని కోరారు. జూన్ 21 న జరిగే ఆదివాసీ హక్కులు చట్టాల అవగాహనా సమావేశం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ మహిళలను అక్రమంగా అరెస్ట్ చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిచారు. ఏజెన్సీ లో ఆదివాసులకు అనేక చట్టలు ఉన్నపటికీ ప్రభుత్వం ఆదివాసులపై సవితితల్లి ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమం లో ఆర్. కొత్తగూడెం సర్పంచ్. తుర్రం రవికుమార్, కలివేరు సర్పంచ్ తెల్లం లక్షణ్ రావు, బోదనెల్లి సర్పంచ్ సింగయ్య, కుర్నపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతి, పెద్దిపల్లి సర్పంచ్ కణితి రామకృష్ణ లతో పాటు శ్యామల తరుణ్, పూనెం రవికిరణ్, ఇర్ప అరుణ్, ఇర్ప సాయి, కోరం వేణు, తాటి శ్రీను, ఇర్ప అరుణ్, మడప అనిల్ తదితరులు పాల్గొన్నారు.





# నారాయణ్‌పూర్‌లో మావోయిస్ట్ డంప్ స్వాధీనం



**చర్ల, జూన్ 18 (మనం న్యూస్) :**
ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నారాయణ్ పూర్ జిల్లాలోని మస్పూర్ – గుద్రపాల్ అటవీప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్ట్ డంప్ స్వాదీన పరుచుకున్నారు. బిఎస్ఎఫ్ 133 బెటాలియన్ ఈ కంపెనీ మస్పూర్ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. మస్పూర్ – గుద్రపాల్ అటవీప్రాంతంలో గాలిస్తుండగా దట్టమైన అటవీప్రాంతంలో డంప్ ను గుర్తించి భారీగా ఆయుదాలు, మందుగుండు సామగ్రిని స్వాదీన పరుచుకున్నారు. ఒక స్వదేశీ రాకెట్ లాంచర్, ఏడు బిజిఎల్ తుపాకులు, ఒక 12 బోర్ బోర్ రైఫిల్, 37 12 బోర్ రైఫిల్స్,15 మీటర్ల వైర్, ఐదు పౌచ్ లను స్వాదీన పరుచుకున్నారు. గత మార్చి 31 తో నారాయణ్ పూర్ జిల్లా మావోయిస్టు రహిత ప్రాయంగా మారిన నేపథ్యంలో గతంలో మావోయిస్టులు అమర్చిన పేలుడు పదార్ధాలు, ఇతర వనరులను భద్రతా బలగాలు గాలిస్తున్న నేపథ్యంలో డంప్ ను గుర్తించి స్వాదీన పరుచుకున్నాయి.

మనం



చర్ల

చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం

# యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోండి

## – మండల వ్యవసాయ అదికారిని లావణ్య



**చర్ల, జూన్ 18 (మనం న్యూస్) :** యూరియా కావాల్సిన రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అదికారిణి ఎస్ లావణ్య విజ్ఞప్తి చేసారు. యాప్ లో ఫోన్ నెంబర్ అప్ డేట్ కాని రైతులు తమ పరిదిలోని వ్యవసాయ విస్తరణా అదికారులను సంప్రదించాలని కోరారు. యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకున్న తర్వాత కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ విషయాన్ని మండల రైతాంగం గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేసారు.

# రాజయ్యనగర్‌లో బడిబాట



**చర్ల, జూన్ 18 (మనం న్యూస్) :** మండలంలోని సుబ్బంపేట పంచాయతీ పరిధిలోని క్రాంతిపురం, రామయ్య నగర్ గ్రామంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రదానోపాద్యాయుడు హరిప్రసాద్, సుబ్బంపేట ప్రాథమికోన్నత పాఠశాల ప్రదానోపాద్యాయురాలు ఝాన్సీ రాణి, సర్పంచ్ కాక సత్యనారాయణ నేతృత్వంలో గురువారం ప్రొపెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 20 మందికి పైగా బడికి దూరమైన విద్యార్థుల తల్లితండ్రులను నేరుగా కలవడం కలసి పాఠశాలకు పంపించాలని విజ్ఞప్తి చేసారు. పంచాయతీ వార్డ్ మెంబరు ఆంధ్రయ్య ను కలసి విద్యార్థులను సుబ్బంపేట పాఠశాల కు పంపించేలా నచ్చచెప్పారు. పాఠశాలకు గ్రామం దూరంలో ఉన్నందున ప్రతిరోజూ విద్యార్దులను ఆటో ద్వారా పాఠశాలకు తరలిస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఆర్పి నరేష్ పాల్గొన్నారు.

# నెలరోజుల పాటు శిక్షణ పొందనున్న డిప్యూటీ కలెక్టర్



**చర్ల, జూన్ 18 (మనం న్యూస్) :** చర్ల మండల కేంద్రంగా డిప్యూటీ కలెక్టర్ ఎం మురళి నెల రోజులపాటు శిక్షణ పొందనున్నారు. ఈ మేరకు ఆయన బాద్యతలను చేపట్టారు. శిక్షణలో బాగంగా వచ్చే నెల 17 వ తేదీ వరకు ఆయన చర్లలోనే ఉండనున్నారు. గురువారం తహసీల్ కార్యాలయంలో అదికారులు, జిపిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సంభవించనున్న గోదావరి వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఉప తహసీల్దార్ ముదరాజు, ఆర్ఐ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దిపల్లి గోదావరిలో టేకు దిమ్మెల స్వాధీనం



**చర్ల, జూన్ 18 (మనం న్యూస్) :** మండలంలోని పెద్దిపల్లి సమీపంలోని గోదావరి నది నీటిలో దాచి ఉంచిన 10 టేకు దిమ్మెలను అటవీశాఖ అదికారులు గురువారం రాత్రి స్వాదీన పరుచుకున్నారు. చర్ల – దుమ్ముగూడెం అటవీ రేంజ్ ల పరిదిలోని అడవులలో నరికిన టేకు కలపను గోదావరి నది నుండి పడవ ద్వారా అక్రమంగా తరలించేందుకు నీటిలో దాచి ఉండినట్లు సమాచారం అందడంతో సెక్షన్ అదికారి రాజేష్ నేతృత్వంలో బేస్ క్యాంప్ సిబ్బంది దాడిచేది వాటిని స్వాదీన పరుచుకున్నారు. స్వాదీన పరుచుకున్న దిమ్మెలను చర్ల అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. వీటి విలువ సుమారు రెండు లక్షల రూపాయలు ఉండవచ్చని తెలుస్తోంది.

మనం



# పినపాక

మణుగూరు మున్సిపాలిటీ - మణుగూరు మండలం - అశ్వాపురం పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

### - రూ.60 లక్షల రూపాయల సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు పరిశీలన



**మణుగూరు, జూన్ 18(మనం న్యూస్):** మణుగూరు మండలం కమలాపురం గ్రామంలో రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబోయే సైడ్ డ్రైన్ నిర్మాణ పనులను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. గ్రామంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా, పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడేలా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సైడ్ డ్రైన్ నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గడంతో పాటు రహదారుల సంరక్షణకు కూడా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని పేర్కొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గ్రామ ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, కట్టు మల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్, సర్పంచులు, ఉపసర్పంచులు, తమ్మిశెట్టి సాంబ, బత్తుల శ్రీను, త్రిమూర్తులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మణుగూరులో 80 కేజీల గంజాయి పట్టివేత

### - రూ.40 లక్షల విలువైన గంజాయి, ఫార్చునర్ కారు స్వాధీనం



**మణుగూరు, జూన్ 18(మనం న్యూస్):** మణుగూరు పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. గురువారం ఉదయం గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం అందడంతో పోలీసులు తోగ్గూడెం సమ్మక్క-సారలమ్మ గుడి సమీపంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి మణుగూరు వైపు వస్తున్న ఫార్చునర్ కారును పోలీసులు ఆపి తనిఖీ చేయగా, కారులో సుమారు 80 కేజీల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన సురేంద్ర సింగ్, ధర్మేంద్ర కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వాంగ్మూలం మేరకు కపిల్ దేవ్ అనే వ్యక్తి గంజాయి రవాణా కోసం వీరిని ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతానికి పిలిపించి, గంజాయి తరలిస్తే రూ.50 వేల పారితోషికం ఇస్తానని చెప్పినట్లు తెలిసింది. అక్కడి నుంచి ఫార్చునర్ కారు (నంబర్ ఆర్ జె 3 యు ఎ 4386)లో గంజాయిని లోడ్ చేసి భద్రాచలం మీదుగా మణుగూరు వైపు తీసుకువస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు గంజాయితో పాటు ఫార్చునర్ కారును కూడా స్వాధీనం చేసుకుని, సురేంద్ర సింగ్, ధర్మేంద్ర కుమార్, కపిల్ దేవ్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన మణుగూరు పోలీస్ స్టేషన్ సిబ్బందిని మణుగూరు డీఎస్పీ అభినందించారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సీఐ



**అశ్వాపురం, జూన్ 18 (మనం న్యూస్):** అశ్వాపురం నూతన సిఐగా బుధవారం బాధ్యతలు చేపట్టిన సిలివేరు ఎల్లయ్య గురువారం మణుగూరు లోని క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన సిఐ సిలివేరు ఎల్లయ్యకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

## ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర

### - 75వ వన మహోత్సవంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
### - భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపు



**మణుగూరు, జూన్ 18(మనం న్యూస్):** అటవీ శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ టెంపుల్ రథంగుట్ట ప్రాంతంలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పాయం ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరితహారం, వన మహోత్సవం వంటి కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. చెట్ల పెంపకం ద్వారా వర్షపాతం పెరగడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రజలకు ఎమ్మెల్యే పాయం పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన అటవీ శాఖ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, జిల్లా జనరల్ సెక్రెటరీ పాలమూరు రాజు, జిల్లా ముఖ్య నాయకులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, తోగ్గూడెం సర్పంచ్ మడకం కృష్ణ, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, ఎస్ గణేష్ రెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ్మిశెట్టి సాంబ, బత్తుల శ్రీను, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## బిటిపిఎస్‌లో ఉద్యోగస్తుల నిరసన

### - జెన్కో డైరెక్టర్ థర్మల్ రాజశేఖర్ రెడ్డి ఎదుట నిరసన
### - తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు



**మణుగూరు, జూన్ 18(మనం న్యూస్):** వై టి పి ఎస్ (యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ )లోని స్టేజ్ -1, స్టేజ్ -2 ల్లో కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్ల నిర్వహణ ను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ టి జి పి ఈ ( తెలంగాణ పవర్ ఎంప్లాయిస్) బి టి పి ఎస్ జేఏసీ నాయకులు బీటీపీఎస్ పర్యటనకు గురువారం వచ్చిన జెన్‌కో డైరెక్టర్ థర్మల్ రాజశేఖర్ రెడ్డి ఎదుట నిరసన తెలిపారు. వై టి పి ఎస్ నిర్వహణ పనులను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించే ప్రయత్నాన్ని నిరసిస్తూ నినాదాలు రాసి ఉన్న ప్ల -కార్డులు ధరించారు. ఈ సందర్భంగా వై టి పి ఎస్ నిర్వహణ పనులను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే జరిగే దుష్పరిణామాలను డైరెక్టర్ కు వివరించారు. అనంతరం జెన్కో ఆధ్వర్యంలోనే పనులను నిర్వహించాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ టి జి పి ఈ బీటీపీఎస్ జె ఏ సి కన్వీనర్ ఎస్ శ్రీనివాస్ రెడ్డి ప్రసంగిస్తూ వైటి పి ఎస్ కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్ నిర్వహణ పనులనను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఇప్పటికే టెండర్ల ఆహ్వానించారని గుర్తు చేశారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించేందుకే టెండర్లను ఆహ్వానించారని ఆరోపించారు. విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి జి పి ఈ ఏ ( తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్) స్టేట్ ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ బి. రవిప్రసాద్, టి జిపి ఏఈ ఏ( తెలంగాణ పవర్ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ) నాయకులు డి.మహేష్,కార్మిక సంఘం-1535 ప్రెసిడెంట్ వి. ప్రసాద్,కార్మిక సంఘం- 1104 ప్రధాన కార్యర్శి బి. సత్యనారాయణ,కార్మిక సంఘం -327 ప్రెసిడెంట్ బి.కృష్ణ, కెమిస్ట్రీ అసోసియేషన్ నాయకులు దయాకర్, తెలంగాణ డిప్లమ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు వి.అనిల్ బీసీ అసోసియేషన్ నాయకులు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక నిల్వచేస్తే కఠిన చర్యలు

### -అధికారులను ఆదేశించిన భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట



**బూర్గంపహాడ్, జూన్ 18(మనం న్యూస్):** అధికారికంగా సొసైటీ సభ్యులు నడుపుకునే ఇసుక ర్యాంపు నుంచే ఇసుక రవాణా జరగాలే తప్ప ఇష్టానుసారం ర్యాంపులు ఏర్పాటు చేసుకుని మైనింగ్శాఖ, సొసైటీ సభ్యుల అనుమతి లేకుండా గోదావరి ఇసుకను తరలిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాచలం సబ్కలెక్టర్ మృణాల్ శ్రేష్ట హెచ్చరించారు. బుధవారం రాత్రి తాళ్లగొమ్మూరు పరిధిలోని గోదావరి పరిసరాల్లో ఇసుక నిల్వలను ఆయన తనిఖీ చేసి రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. మండల పరిధిలోని సోంపల్లి అధికారిక ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈ క్రమంలో ర్యాంపులను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. సొసైటీ సభ్యులు అధికారికంగా నిర్వహించే ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక సరఫరా కావాలని, అక్రమంగా ఇసుక తరలించకుండా గోదావరి ఇసుక ఉన్న ప్రదేశాల్లో కంచెలు, కందకాలు తవ్వించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పరిసర ప్రాంతాల్లో 24 గంటలూ నిఘా ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని, అనధికారికంగా ఇసుక తరలించే వారి వాహనాలు సీజ్ చేసి అవసరమైతే వారిని అదుపులోకి తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణా నేపథ్యంలో ఏదో ఒక సమయంలో ర్యాంపులను తనిఖీ చేస్తానని... ర్యాంపులు నిర్వహించే నిర్వాహకులు నిజాయితీగా అక్రమాలకు పాల్పడకుండా ఇసుక రవాణా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి పంచాయతీ పూర్తి సహకారం



**బూర్గంపహాడ్, జూన్ 18(మనం న్యూస్):** విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇరవెండి పంచాయతీ పూర్తి సహకారం ఉంటుందని పంచాయతీ సర్పంచ్ గుండి బాబూరావు, ఉపసర్పంచ్ మహంకాళి రామారావులు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, విద్యార్థికి ఏ అవసరం ఉన్నా పంచాయతీ నుంచి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు గుగులోతు దుర్గ, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో గాయపడిన పోస్టుమాన్



**బూర్గంపహాడ్, జూన్ 18(మనం న్యూస్):** విధి నిర్వహణలో ఉన్న పోస్టుమాన్పై కోతులు దాడిచేసిన సంఘటన గురువారం బూర్గంపహాడ్లో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పోస్టాఫీస్లో పోస్టుమాన్గా పనిచేస్తున్న నాగరాజు విధి నిర్వహణలో భాగంగా పోస్టల్ కార్డులు బట్వాడా చేసేందుకు వెళ్లగా ఓ ఇంటి వద్ద కోతులు అతనిపై ఒక్కసారిగా దాడిచేశాయి. ఈ దాడిలో గాయపడిన పోస్టుమాన్ను స్థానికులు బూర్గంపహాడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స నిర్వహిస్తున్నారు. పంచాయతీ అధికారులు కోతులను తక్షణమే నిర్మూలించి దాడులు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## నీళ్లు లేని బావిలో పడిన గేదెలను రక్షించిన అమెర్ద వాసులు



**అశ్వాపురం, జూన్ 18 (మనం న్యూస్) :** మండలంలోని అమెర్ద గ్రామపంచాయతీలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు నీళ్లు లేని బావిలో పడిపోయిన రెండు గేదెలను గ్రామస్తులు, అధికారులు కలిసి గురువారం సురక్షితంగా బయటకు తీశారు. గేదెలు పాడుబడ్డ బావిలో పడ్డ విషయం తెలిసిన వెంటనే అమెర్ద గ్రామపంచాయతీ సర్పంచ్ కొర్స కృష్ణ స్పందించి, గేదెలను బయటకు తీయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించగా, ఉప సర్పంచ్ మేకల అంజిబాబు స్పందించి ?అగ్నిమాపక శాఖ సిబ్బంది సహకారంతో, ?అనంతనేని సురేష్, చంద్రశేఖర్ ల జెసిబి సహాయంతో గేదెలను బావిలో నుండి పైకి తీశారు.?గ్రామ పెద్దలు కిలారి శేషగిరిరావు,వార్డు నెంబర్ అర్జున్ , తెల్లంవారిగుంపు గ్రామ ప్రజలు ఈ ఆపరేషన్లో చురుగ్గా పాల్గొన్నారు. అందరి ఉమ్మడి భాగస్వామ్యం, సమయస్ఫూర్తితో బావిలో పడ్డ గేదెలను ఎటువంటి ప్రాణనష్టం లేకుండా సురక్షితంగా బయటకు తీశారు.మూగజీవాల ప్రాణాలను కాపాడటంలో తక్షణమే స్పందించిన సర్పంచ్, ఉప సర్పంచ్, ఫైర్ సిబ్బంది. అశ్వాపురం పశువైద్యాధికారి, వైద్యసిబ్బంది , జెసిబి నిర్వాహకులతో పాటు సహకరించిన గ్రామ ప్రజల సమయస్ఫూర్తిని మండల ప్రజలు అభినందించారు. పాడుబడ్డ బావుల వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు సూచించారు.

## కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో సీఐకి సత్కారం



**అశ్వాపురం, జూన్ 18 (మనం న్యూస్) :** మండల కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో అశ్వాపురం సీఐగా నూతన బాధ్యతలు చేపట్టిన సిలివేరు ఎ ల్ల య్య ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసే శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, అశ్వాపురం ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు సీఐ ఎల్లయ్య సమర్థవంతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆకాంక్షించారు. అనంతరం సీఐ ఎల్లయ్య సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గంగాధర కృష్ణ, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి రాము, నాగారపు నాగరాజు, సిలివేరి చంద్రరావు, సిలివేరి వెంకన్న, మాడుగుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలోనే నాణ్యమైన విద్య

**- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు**
**- విద్యార్థులకు పుస్తకాలు బట్టలు పంపిణీ**



**దుమ్ముగూడెం జూన్ 18 (మనం న్యూస్):** ప్రభుత్వ పాఠశాలలలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని , విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించబడుత న్నాయని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం దుమ్ముగూడెం మండల పర్యటన సందర్భంగా దబ్బనూతల, చిన్నార్ల గూడెం గ్రామల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ప్రాంత ఆదివాసి గిరిజన పేద మతి తరగతి వర్గాల విద్యార్థినీ విద్యార్థులు కృషి పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు దుస్తులు మధ్యాహ్న భోజన సౌకర్యం వంటి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తూ విద్యను ప్రోత్సహిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి నాణ్యమైన విద్య అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్రం వీరభద్రం, కాంగ్రెస్ పార్టీ దుమ్ముగూడెం మండల అధ్యక్షులు తెల్లం హరి కృష్ణ, సర్పంచులు ఆదినారాయణ, తామా. బాలరాజు, పాయశీ. వెంకటేష్, ఉప సర్పంచ్ వాగే. శ్రీధర్, పార్టీ నాయకులు, తోట రమేష్, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో 300 మంది చేరిక

**ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి తోనే కాంగ్రెస్ పార్టీలో చేరికలు : ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**



**దుమ్ముగూడెం జూన్ 18 (మనం న్యూస్):** దుమ్ముగూడెం మండలం, నరసాపురం గ్రామంలో వీరమాచినేని సునీల్ తో పాటు 300 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో మీరు పార్టీలో చేరగా భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తెల్లం హరికృష్ణ చేతుల మీదుగా నాయకులు వీరమాచినేని సునీల్ మరియు 300 మందికి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ లో చేరికలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరుతున్న వారికి ఆయన స్వాగతం పలుకుతూ రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అన్నే. సత్యనారాయణమూర్తి (సత్యాలు) జిల్లా ప్రధాన కార్యదర్శి, పిలక వెంకటరమణారెడ్డి,జిల్లా కార్యదర్శి లంక అబ్బులు, మండల నాయకులు, పూజారి సూర్య చంద్రరావు, తోట రమేష్, వర్స శివరామకృష్ణ, తెల్లం రామకృష్ణ, కనుకు ముత్తయ్య, దేగల విజయరావు,అలా వెంకటకృష్ణ, పూజారి నరేష్, కోయిలమూడి సాగర్,కనుకు గోపాలకృష్ణ,సర్పంచ్ పొడియం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నం సేవా ఫౌండేషన్ ఆశ్రయితులకు ఆధార్ నమోదు

**– గుర్తింపు, గౌరవప్రద జీవనానికి కొత్త ఆశలు**




**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** నిరాశ్రయులు, అనాథలు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తున్న అన్నం సేవా ఫౌండేషన్లో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం ఆశ్రయితుల జీవితాల్లో కొత్త ఆశలను నింపింది. గుర్తింపు, సంక్షేమ సేవల ప్రాప్తి, అలాగే కొందరికి కుటుంబాలతో పునరేకీకరణకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ (టిఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి పంచాక్షరి ఆదేశాలు, జిల్లా న్యాయ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు (ఇన్చార్జ్), జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జి.వి. మహేష్ నాథ్ మార్గదర్శకత్వంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస అన్నం సేవా ఫౌండేషన్ను సందర్శించి ఆశ్రయితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ఆశ్రయితులలో చాలామందికి గుర్తింపు పత్రాలు లేకపోవడం వల్ల సంక్షేమ సేవలు, ఇతర ప్రయోజనాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా యంత్రాంగం మరియు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ఆశ్రమంలోనే ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టరేట్ మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక శిబిరం నిర్వహణకు సహకరించారు. శిబిరంలో ఆశ్రయితుల బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసి ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే గతంలో ఆధార్ పొందిన వారి వివరాలు గుర్తించబడితే వాటిని తిరిగి పొందేందుకు చర్యలు తీసుకోనున్నారు. అటువంటి వివరాలు లభించిన పక్షంలో వారి అసలు గుర్తింపును నిర్ధారించి కుటుంబ సభ్యులను గుర్తించే అవకాశం ఉంటుంది. కుటుంబ వివరాలు లభించిన వారికి పునరేకీకరణ దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వివరాలు లభించని వారికి కొత్త ఆధార్ కార్డులు జారీ చేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస మాట్లాడుతూ, గుర్తింపు పత్రం అనేది కేవలం ఒక కార్డు మాత్రమే కాదు. సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న వ్యక్తులకు అది గౌరవప్రదమైన జీవనం, సంక్షేమ సేవలు మరియు న్యాయ పరిరక్షణకు ద్వారంగా నిలుస్తుంది అని పేర్కొన్నారు. ఆధార్ నమోదు పూర్తయిన అనంతరం జాతీయ న్యాయ సేవా సంస్థ అమలు చేస్తున్న నిరాశ్రయులు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు, సామాజికంగా విస్మరించబడిన వర్గాలు మరియు పేదరికంలో జీవిస్తున్న వారికి సంబంధించిన వివిధ న్యాయ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశ్రయితులకు అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులో గౌరవప్రదంగా జీవించే హక్కు కూడా అంతర్భాగమేనని, సమాజంలోని అత్యంత బలహీన వర్గాలకు గుర్తింపు, న్యాయ సహాయం, సంక్షేమ అవకాశాలు చేరేలా చూడటం న్యాయ సేవా సంస్థల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఏళ్ల తరబడి గుర్తింపు పత్రాలు లేకుండా, కుటుంబ సభ్యుల ఆచూకీ తెలియని పరిస్థితుల్లో జీవిస్తున్న పలువురు ఆశ్రయితులకు ఈ ఆధార్ నమోదు శిబిరం కొత్త ఆశాకిరణంగా మారింది. గుర్తింపు, సంక్షేమ సేవల ప్రాప్తి, కుటుంబాలతో తిరిగి కలిసే అవకాశాలకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేయనుంది.

మనం



# ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి



## పూసపల్లి ప్రాజెక్టు సాధనకు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

**ఇల్లందు, జూన్ 18 (మనం న్యూస్) :** పూసపల్లి ప్రాజెక్టు సాధనకు గురువారం ఇల్లెందు పెన్షనర్ల భవనంలో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ ప్రాజెక్టు ఆవశ్యకత అవసరాన్ని గుర్తించింది. ఈ ప్రాజెక్టు రాకపోతే ఇల్లెందు పట్టణం అస్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉందని అన్ని కార్మిక సంఘాలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో అన్ని సంఘాలను కలుపుకొని మరోసారి విస్తృతస్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాలని అందులో భాగంగా ఈ సమావేశానికి హాజరుకాని ఐ ఎన్ టి యు సి, ఏ ఐ టి యు, సి, సి ఐ టి యు, సంఘాలకు హాజరైన సంఘాల తరఫున విజ్ఞప్తి చేస్తూ లేఖరాయాలనితీర్మానించింది. తిరిగి సమావేశం జూన్ 27న జరపాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ సమావేశంలో కెంగర్ల మల్లయ్య (టీజీబీకేఎస్),జె. సీతారామయ్య(జి ఎల్ బి కే ఎస్), కె. విశ్వనాథ్(జి ఎల్ బి కే యు),నాయిని సైదులు(బి ఎం ఎస్)ఎస్.కే.యాకుబ్ షావలి(టి యు సి ఐ),బాల ప్రసాద్(హెచ్ ఎం ఎస్)తోపాటు వివిధ సంఘాల నాయకులు కొక్కు సారంగపాణి,కందగట్ల సురేందర్,కొప్పుల శ్రీనివాస్,పోశంబాబు పాల్గొన్నారు.

## ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలి

### పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు



**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని, ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్లో జిల్లా అధ్యక్షుడు వంకాయల రాజు అధ్యక్షతన జరిగిన ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి, జిల్లా స్థాయిలో ఫీజు నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి, విద్యాసంస్థల ఫీజులపై పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల పెంపుపై తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలే పాఠ్యపుస్తకాలు విక్రయించడం, అధిక ధరలకు పుస్తకాలు అమ్మడం జరుగుతోందని పేర్కొన్నారు. ఇటువంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య హక్కు అయినప్పటికీ రాష్ట్రంలో విద్యను వస్తువుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లాలో విద్యార్థుల సమస్యలపై విస్తృతంగా చర్చించి, పాఠశాలలు, కళాశాలల సందర్శనలు చేపట్టి సమస్యలను గుర్తించి ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలు మూసివేయాలని, జిల్లా అధికారులు పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థలలో తనిఖీలు చేసి దుకాణాలు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దొంతపోయిన వెంకటేష్, రెడ్డి పోగుల. త్రినాథ్, భాను శ్రీకర్,శ్యామ్, లోహిత్ కుమార్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్‌పి బస్తీ గ్రామ పంచాయితిలో బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం

కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు కోరం. నూతనంగా ప్రతిష్టించిన నాభిశిల ముత్యాలమ్మ తల్లి అమ్మవార్లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజా









**ఇల్లందు, జూన్ 18 (మనం న్యూస్) :** ఇల్లందు మండల సీఎస్పీ, బస్తీ, గ్రామపంచాయతీ లో జూన్ 15వ తారీఖు సోమవారం నుండి 18 తారీకు గురువారం వరకు నూతన బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేదమంత్రోచ్చారణ నడుమ మూడు రోజులపాటు కన్నుల పండుగగాపూజాక్రతువులతోపాటు హోమాలు, జపాలు, అత్యంతభక్తిశ్రద్ధలతోనిర్వహించారు. గ్రామస్తులు హాజరై నూతనంగా ప్రతిష్టించిన నాభి శిలా, ముత్యాలమ్మ తల్లి, అమ్మవార్ల, విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం చివరి రోజు పూజా కార్యక్రమాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు . గురువారం ముత్యాలమ్మ తల్లి ప్రత్యేక బలిహారాలు పూజలు నిర్వహించి క్రతువుముగించారు. ఈకార్యక్రమంలోఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్రాంబాబు...ఇల్లందు మండల పార్టీ అధ్యక్షులు మండల రాం మహేష్ ... సీఎస్పీ, బస్తీ గ్రామపంచాయతీ సర్పంచ్ పాయం స్రవంతి కృష్ణ ప్రసాద్, బొజ్జాయిగూడెంగ్రామపంచాయతీ ఉపసర్పంచ్అరెంకిరణ్,నాయకులు ప్రసన్న కుమార్, దండుగుల శివ, స్థానిక నేతలు తదితరులు ఉన్నారు..

## ప్రైవేట్ బడి వద్దు.. ప్రభుత్వ బడి ముద్దు

### - కొమరారం సర్పంచ్ అజ్మీర బిచ్చు



**ఇల్లందు, జూన్ 18 (మనం న్యూస్) :** కొమరారం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఇంద్లా తండా ప్రాథమిక పాఠశాల పరిధిలోని పిల్లలతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ అనంతరం కొమరారం ప్రాథమిక పాఠశాల (చిన్న బడి) సెంటర్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుధాకర్, అధ్యక్షతన మినీ సభ నిర్వహించడం జరిగింది. ఈ సభలోకొమరారంగ్రామపంచాయతీ సర్పంచ్ అజ్మీర బిచ్చు, ఉప సర్పంచ్,బుర్రిప్రవీణ్ ,మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు మన గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను జాయిన్ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫై టీచర్స్ ఉచిత మధ్యాహ్న భోజనం ఉచిత యూనిఫామ్స్, ఉచిత పుస్తకాలు, ఆటలు, సైన్స్ ల్యాబ్, ఫిజిక్స్ ల్యాబ్, ఇంగ్లీష్, ల్యాబ్, డిజిటల్ ల్యాబ్, లాంటి ఎన్నో అధునాతన సౌకర్యాలు మనగ్రామపాఠశాలలోఉన్నాయని వారన్నారు. ఇలాంటి సౌకర్యాలను అన్ని వదిలి గ్రామ ప్రజలు ప్రైవేట్ పాఠశాల వైపు చూస్తున్నారని దీంతో పేద మధ్యతరగతి కుటుంబాలు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో అప్పులుచేసిమరిచదివిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అందించే ప్రభుత్వ పథకాలు ఉచిత విద్యుత్ రైతు బీమా రైతు బంధు ఉచిత బియ్యం ఇంకా ఇలాంటి ఎన్నో ప్రభుత్వ పథకాలు తీసుకుంటున్న ప్రజలు ప్రభుత్వ బడులకు మీ పిల్లలను ఎందుకు పంపించట్లేదనిప్రశ్నించారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు రైతులు ప్రతి ఒక్కరు కూడా మీ పిల్లలను మన గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆరవ వార్డు మెంబర్ మాధవి, మూడో వార్డు మెంబర్ భూక్య భారతి, పంచాయతీ సెక్రటరీ నాగమణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాణి, శిరీష, సుజాత, అంగన్వాడీ టీచర్స్ దీప్తి, పద్మ, సక్కుబాయి, ఆశా వర్కర్లు విజయ, దేవకి, ఉన్నత పాఠశాలఉపాధ్యాయులు లింగయ్య నాయక్, ప్రభుదాసు, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, రాంబాబు, హీరో, రాజా, నరసింహారావు, విజయకుమార్, త్రివేణి, మమతా, పిఏసిఎస్ వైస్ చైర్మన్,పోలపల్లినాగేశ్వరరావు,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాబంద కొమరం గ్రామ కార్యదర్శి వాంకుడోత్ శంకర్, మండల నాయకులు శాంతారావు, పి వై ఎల్ మండల నాయకులు భయ్యా వెంకన్న, కాంగ్రెస్ నాయకులు నారాయణ, గైగొల్ల శ్రీను, అడ్వకేట్ అజ్మీర భరత్, గ్రామస్తులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలా

## టిఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు గోల్ తండా ఉపసర్పంచ్ షేక్ చందు



**తిరుమలాయపాలెం జూన్ 18 (మనం న్యూస్ ) :** తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని తిరుమలాయపాలెం బి ఆర్ ఎస్ మండల పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చందు డిమాండ్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బిడ్డల నోళ్ల కొట్టి టెండర్లలో వేల కోట్ల అవినీతికి పాల్పడడమే కాకుండా, ఆ అవినీతిని ప్రశ్నించినందుకు వ్యక్తిత్వ హననం చేస్తూ, రూపాను అవహేళన చేస్తారా ఇది కేవలం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై జరిగిన దాడి కాదు తెలంగాణలోని బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులపై జరిగిన దాడి అని పేర్కొన్నారు. వెంటనే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# నేడే పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం పంపిణీ

**తిరుమలాయపాలెం, జూన్ 18 (మనం న్యూస్ ):** మే నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మరణించిన వ్యక్తుల కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి గ్రామాల వారీగా నిర్ణయించిన సమయాల ప్రకారం ఈ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. మండలంలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు, జల్లేపల్లి, హస్నాబాద్, కాకరవాయి, సోలీపురం, తిమ్మకపేట, కొక్కిరేణి సహా మొత్తం 28 గ్రామాల్లో దశలవారీగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు.

# నారాయణ పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

## ఐసా, జార్జి రెడ్డి పిడిఎస్‌యు, బిఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ

## అక్రమంగా పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలపై గోడౌన్ సీజ్

**ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్):** ఖమ్మం నగరంలోని మమత హాస్పిటల్ రోడ్డులో ఉన్న నారాయణ కార్పొరేట్ పాఠశాల ఎదుట ఐసా, జార్జిరెడ్డి పీడీఎస్యూ, బీఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసా జిల్లా కార్యదర్శి జమ్మి అశోక్, జార్జిరెడ్డి పీడీఎస్యూ జిల్లా కార్యదర్శి రాము, బీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ మాట్లాడుతూ'విద్యా హక్కు చట్టం, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ నారాయణ విద్యాసంస్థలు తమ సొంత బ్రాండ్ పేర్లతో ముద్రించిన పుస్తకాలు, స్టేషనరీ వస్తువులను విద్యార్థులకు బలవంతంగా అధిక ధరలకు విక్రయిస్తున్నాయని ఆరోపించారు. దీనివల్ల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాల నిరసన నేపథ్యంలో ఇంచార్జ్ ఎంఈఓ శైలజ సంఘటనా స్థలానికి చేరుకుని పాఠశాల ఆవరణలో ఉన్న పుస్తకాలు, స్టేషనరీ నిల్వ గోడౌన్ను పరిశీలించారు. ప్రాథమిక విచారణలో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన నేపథ్యంలో సంబంధిత గోడౌన్ను సీజ్ చేశారు. విద్యార్థి సంఘాలు సమర్పించిన ఆధారాల మేరకు పూర్తి స్థాయి విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. పుస్తకాలు, యూనిఫాంలు,



స్టేషనరీ మరియు ఇతర విద్యా సామగ్రిని సొంత బ్రాండ్ పేర్లతో విక్రయిస్తూ అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలోని పలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యాశాఖ పర్యవేక్షణ లోపిస్తోందని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నారాయణ పాఠశాలలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా హక్కు చట్టం మరియు ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ స్వంత బ్రాండ్ పుస్తకాలు విక్రయిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో ఐసా, యూఎస్ఎఫ్ఐ, జార్జిరెడ్డి పీడీఎస్యూ, బీఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖబర్దార్ కేటీఆర్...

(మొదటి పేజీ తరువాయి)

నిద్రపోయేటప్పుడు మాత్రమే కనండి నాయనా తెలంగాణ ప్రజలు ఇప్పటికే మీకు తీర్పు చెప్పారు, అంటూ హెచ్చరించారు. తెలంగాణ సెంటిమెంట్ను మళ్ళీ అడ్డుపెట్టి రాజకీయం చేయాలన్న కేటీఆర్ ఆశలు ఎప్పటికీ నెరవేరవని స్పష్టం చేశారు. మా త్రిమూర్తుల ఇలాఖా అయిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వచ్చి అడ్డగోలు ప్రసంగాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. చూసుకో కాచుకో నీ రాజకీయ జిమ్మిక్కులు ఇక్కడ నడవవు ఖబర్దార్ కేటీఆర్, అంటూ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.

# భవిష్యత్‌కేదీ భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఛత్తీస్‌ఘడ్ నుండి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. రెండు గ్రామాలలో కలపి 60 కుటుంబాలు, 3 వందలకు పైగా జనాభా నివసిస్తోంది. రెండు గ్రామాలలో కలిపి 40 కి పైగా బడిఈడు పిల్లలు ఉన్నారు. అయినా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేదు. దీంతో అనేకమంది చదువులను మధ్యలోనే నిలిపివేయగా మరి కొంతమంది చర్లలోని వివిధ వసతి గృహాలలో ఉంచి చదువుకుంటున్నారు. ఇందులో 23 మంది 1 నుండి 5 వ తరగతి చదువుతున్నారు. వీరంతా గతంలో సుబ్బంపేట, సుందరయ్య కాలని గ్రామాలలోని పాఠశాలలో విద్యనభ్యసించేవారు. రెండేళ్ల క్రితం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై ఇసుక లారీ ఢీకొనడంతో చర్లలోని ఒక ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మృతిచెందారు. తీవ్ర భయాందోళనకు గురయిన గ్రామస్తులు తమ పిల్లలను చదువులను మాన్పించి గ్రామంలోనే ఒక ఇంటి దగ్గర సొంతంగా పాఠశాలను నిర్వహించడం ప్రారంభించారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని అంత వరకు తామే తమ పిల్లలకు చదువులు చెప్పుకుంటాలని తెగేసి చెప్పారు. ప్రభుత్వం గిరిజనుల మొరను ఆలకించలేదు. భీష్మించుకు కూర్చున్న గిరిజనులు సొంతంగా రేకుల షెడ్డును నిర్మించి తమ సొంత ఖర్చులతో 10 వ తరగతి చదివిన యువతిని ఉపాధ్యాయురాలిగా నియమించుకొని చదువులను చెప్పించడం ప్రారంభించారు. పాఠశాలకు ప్రభుత్వం అనుమతి లేకపోవడంతో ఇక్కడ చదువుతున్న 23 మంది విద్యార్థుల భవిష్యత్ అందకారంగా మారింది. గత రెండేల్లుగా ఇక్కడి విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోతున్నా ఏ అధికారి పట్టించుకున్న పాపానపోలేదు. ఆదివాసీ గ్రామం కావడంతో అక్కడ ఐటిడిఏ అధికారులే పాఠశాలను ఏర్పాటు చేయాలన్న తలంపుతో విద్యాశాఖ వీరి సమస్యను పట్టించుకోలేదు. ఇలా రెండేళ్ల విలువైన కాలాన్ని ఇక్కడి విద్యార్థులు నష్టపోయారు. అయినా ఐటిడిఏ, విద్యాశాఖ అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. ఎట్టకేలకు చర్ల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్, సుబ్బంపేట ప్రాదమికోన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి, సర్పంచ్ కాక సత్యనారాయణ, సిఆర్పి నరేష్ లు గురువారం రాజయ్యనగర్ గ్రామానికి చేరుకొని గ్రామ పెద్ద రేగ ఆంద్రయ్యను కలసి గ్రామానికి చెందిన విద్యార్థులను సుబ్బంపేట పాఠశాలకు పంపించమని అభ్యర్థించారు. విద్యార్థుల విలువైన కాలాన్ని వృదా చేయవద్దని అభ్యర్ధించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ముగిసే వరకు గ్రామం నుండి విద్యార్థులను ఆటోల ద్వారా తరలిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో స్పందించిన ఆంద్రయ్య గ్రామంలో ఐటిడిఏ పాఠశాల ఏర్పాటుకు అధికారులు కృషిచేయాలని విజ్ఞప్తి చేసారు. అంతవరకు గ్రామస్తులందరితో చర్చించిన అనంతరం పాఠశాలకు విద్యార్థులను పంపుతామని సానుకూలంగా స్పందించడంతో రెండేల్లుగా సాగుతున్న ఉత్కంఠతకు తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామస్తులు సైతం పట్టుదలకు పోకుండా విద్యార్థులను పాఠశాలకు పంపి వారి బంగారు భవిష్యత్ కు పునాది వేయాలని పలువురు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే 'ముఖాముఖి'

- అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదు
- ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజలకు చేరువచేసేందుకే ''ముఖాముఖి' కార్యక్రమం
- ప్రజా వినదులు సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ చేపడతాం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- ప్రజలతో ఎమ్మెల్యే ముఖాముఖి కార్యక్రమానికి అపూర్వ స్పందన

**పాల్వంచ, జూన్ 18(మనం న్యూస్):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారంకోసమే 'ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సమస్యలను నేరుగా తెలుసుకోవడంతోపాటు అధికార యంత్రాంగాన్ని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. 'మనకోసం..మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గురువారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలనుంచి అనూహ్య స్పందన లభించింది. వివిధ శాఖల అధికారులు, వివిధ ప్రాంతాలలోని లబ్దిదారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అక్కడే ఉన్న అధికారులను వాటిని తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. పలురకాల వినతులు స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులను ప్రజలచెంతకు చేర్చేలా తాము ''ముఖాముఖి' కార్యక్రమం చేపట్టామని తెలిపారు. దీని ద్వారా ప్రజాసమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని అధికారులను హెచ్చరించారు. మౌలిక వసతుల కల్పనతోనే బస్తీలు, గ్రామాలు సమగ్ర అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూసేందుకు నిరంతరం పర్యవేక్షిస్తామని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రభుత్వ పథకాలు



క్షేత్రస్థాయిలో నిజమైన లబ్దిదారులకు చేరినప్పుడే ఆశించిన ఆశయాలు నెరవేరుతాయని వివరించారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా దర్బార్ తరహాలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, తహసీల్దార్ దారా ప్రసాద్, ఇంచార్జీ కమిషనర్ విజయానంద్, టౌన్ ఎస్సై తోట నాగరాజు, అబ్కారీ సీఐ ప్రసాద్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, గొర్లె అన్నపూర్ణ, చెరుకు భాగ్యలక్ష్మి, దున్నపోతుల మణి, వీ భవిత, దంతబోయిన నరేష్, నాయకులు పద్మజ, సుధాకర్, అన్నారావు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, సెనగారపు శ్రీనివాసరావు, రెహమాన్, గిరి, గౌస్ పాషా, మస్తాన్, అహ్మద్ జానీ, కరీం, గొర్లె నరేష్, నామ పండు, ఆలపాటి ప్రసాద్, అల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు